₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 24

డిసెంబరు 16 - 31, 2018



## మళ్లీ కేసీ ఆర్!



ఎన్నికల్లో ధనప్రవాహం - ఊబిలో పార్టీలు - సంక్షోభంలో సమాజం



## జన జీవితాలు, యువత భవిష్యత్తుతో సంబంధంలేని ఎన్నికలు, రాజకీయంపై..

## 6,7 జనవరి 2019 న విజయవాడలో లోక్‌సత్తా పార్టీ ఏపీ, తెలంగాణ నేతల మేధోమథనం



## 497

## 'వైవాహిక' ఫిరాయింపులు నేరం కాదా?



# లీడర్‌షిప్ ఇన్ పబ్లిక్ పాలసీ

దేశాన్ని బాగుచేయటానికి అవసరమైన విధానాలపై యువతకు అవగాహనను పెంచి నాయకులుగా తయారుచేసేందుకు ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన (ఎల్‌పీపీ 18, యూకేషన్‌ఇండియా,తక్షశిల) సమావేశంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పలు అంశాలపై చర్చను లేవనెత్తుతూ దిశానిర్దేశం చేశారు. జవాబుదారీతనం లేని కేంద్రీకృత పాలన భారతదేశ ఎదుగుదలను కుంగదీస్తోందని. మన ఉమ్మడి ప్రయోజనాల కోసం సంఘటితంగా పనిచేయటానికి కావలసిన అవగాహన లోపించటం పౌర బృందాలు, ముక్కచెక్కలుగా ఉన్న సమాజం మధ్య అపనమ్మకాన్ని పెంచుతోందని అన్నారు. ఆర్థిక, రాజకీయ అంశాలు, ఎన్నికలు, ఆరోగ్యరంగం, ఎన్నికల ప్రచార నిధులు, ప్రభుత్వాధికారులు, పాలనతీరు తదితర అంశాలను ప్రస్తావిస్తూ రాజకీయ, పాలనా రంగంలో సమూల పరివర్తన తేగల ఆచరణీయ పరిష్కారాలను జేపీ సూచించారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

డిసెంబర్ 16-31, 2018 సంపుటి - 2 సంచిక - 24

## లోపలి పేజీల్లో...

కేసీఆర్ 2.0, రాహుల్ తొలి వార్షికోత్సవ .........5
ఎన్నికల్లో ధన ప్రవాహం ఊబిలో పార్టీలు.......... 6
కట్టలు తెగిన డబ్బుకి పాలమూరే సాక్షి.............. 10
జాంబవంత అంగాపై ప్రధాని జబ్బలు .................. 12
ఓటు డైలమా... ఇంకొన్ని సంగతులు ! .............. 16
జాలర్లను విడిపించేందుకు చర్యలు చేపట్టండి..... 22
497... తెలిసియు తెలియని నరు తెల్పబ్రహ్మ..... 23
నేరమా? ................................................ 26
ఛాందస శక్తులకు, నియంతృత్వ రాజకీయానికి... 28
వేలం పాటల పట్ల హర్షం..............................32
ఆయుష్మాన్ భారత్‌ని సమూలంగా ప్రక్షాళన ....... 33
6,7 జనవరి 2019 న విజయవాడలో ............34

## కార్టూన్ కార్నర్




ఎంతమంది వెళ్లినా మన పార్టీకి ఢోకా లేదు. మన పిల్లలూ, పిల్లల పిల్లలూ, అల్లుళ్లూ కోడళ్లూ, బామ్మర్దులూ, మరదళ్లూ, వియ్యంకులూ, తోడల్లుళ్లూ బోలెడు మంది ఉన్నారు.

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# మీ అభిప్రాయాలు చెప్పండి..

ఆత్మీయ పాఠకులారా!

లోక్‌సత్తా భావజాలాన్ని ఇతరత్రా మార్గాలతో పాటు రకరకాల ప్రచురణల ద్వారా కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గత 22 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. ఏ అంశం మీదైనా, ఎంత సంక్లిష్టమైన, వివాదాస్పదమైన, భావోద్వేగపూరితమైన సమస్యమీదైనా లిఖితపూర్వకంగా తన వైఖరిని చెప్పే సాహసం, నిబద్ధతగల రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా! సమాజంలో, దేశంలో, ప్రపంచంలో మునుపెన్నడూ లేనంత శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నా కూడా.. లోక్‌సత్తా భావజాలం ఇప్పటికీ చెక్కుచెదరకుండా దిక్సూచిగానే కొనసాగుతోందని ఈ ప్రచురణల్లో భాగస్వాములైనవారిగా నిర్ద్వంద్వంగా చెప్పగలుగుతున్నాం. వీలైనన్ని ఎక్కువ ప్రచురణలతో నిరంతరాయంగా ఈ అజరామర భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాన్నదే మా (మీ) ఆకాంక్ష. మ్యాగజైన్ ప్రచురణల్లో భాగంగా పక్షపత్రికగా 'లోక్‌సత్తా టైమ్స్'ని, మాసపత్రికగా 'జనబలం'ని తీసుకొస్తున్నామని మీకందరికీ తెలుసు. ఇటీవలికాలంలో ప్రింట్ ధర, ఇతర ఖర్చులు పెరిగిపోవటంతో ఈ పత్రికల ప్రచురణ భారంగా మారింది. మన వనరులకు - పత్రికల వ్యయానికి పొంతన కుదరటం లేదు. ఇదేసమయంలో ఏదోకరూపంలో భావజాలాన్నయితే ప్రజల్లోకి తీసుకెళ్తూండాలి. ఈ నేపథ్యంలో.. ఏ వేదిక ద్వారా ప్రచురితమైనా లోక్‌సత్తా టైమ్స్, జనబలం రెండూ లోక్‌సత్తా భావజాల పత్రికలే కాబట్టి రెంటినీ విలీనం చేసి ఒకే పత్రికగా తీసుకురావలనే ప్రతిపాదన వచ్చింది. "రెండిటిలో ఏది తేవాలి, పక్షపత్రికగానా లేక మాసపత్రికగానా, ప్రింట్ ఎడిషన్‌గానా, ఆన్‌లైన్ పత్రికగానా?".. అనే చర్చ జరుగుతోంది. లోక్‌సత్తా కుటుంబ సభ్యులుగా ఈ అంశాలకు సంబంధించి మీ అభిప్రాయాలను కూడా తెలియచేయండి. మొత్తాన్నీ కూలంకషంగా సమీక్షించి నిర్ణయం తీసుకుందాం. అయితే ఆలస్యమయ్యేకొద్దీ భారం పెరుగుతుంది. డిసెంబర్-జనవరిల్లోనే నిర్ణయం అమల్లోకి వచ్చేయాలి. మీ అభిప్రాయాల్ని, ఆదాయాన్ని పెంచుకునే మార్గాల సూచనల్ని దిగువ పేర్కొన్న ఐడీలకి సాధ్యమైనంత త్వరగా ఈ-మెయిల్ చేయవలసిందిగా మనవి.

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

– ఎడిటోరియల్ టీం

# కేసీఆర్ 2.0, రాహుల్ తొలి వార్షికోత్సవ విజయాలు






తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించింది. మొత్తం 119 స్థానాలకుగాను.. 2.0 ఎన్నికల్లో 88 స్థానాల్లో గులాబీ పార్టీ విజయబావుటా ఎగురవేసింది. టీఆర్ఎస్ అభ్యర్థులకు పలుచోట్ల భారీ మెజారిటీలు రాగా, కొన్నిచోట్ల స్వల్ప ఆధిక్యతలతో ఫలితాలు తారుమారయ్యాయి. అధికార పార్టీకి రికార్డుస్థాయిలో 46.9 శాతం (97,00,749) ఓట్లు రాగా, ప్రజాకూటమి పేరుతో ప్రధాన ప్రత్యర్థిగా తలపడిన కాంగ్రెస్ 28.4 శాతం (58,83,111) ఓట్లతో 19 స్థానాలకు పరిమితమైంది. కూటమిలోని తెలుగుదేశానికి కేవలం 2 సీట్లు దక్కాయి. 2014లో 14 శాతానికిపైగా ఓట్లు సాధించిన టీడీపీకి ఈసారి 3.5 శాతం ఓట్లు లభించాయి. కూటమిలోని ఇతర భాగస్వాములైన సీపీఐ, తెలంగాణ జనసమితికి ఒక్క సీటూ రాలేదు. ఆ పార్టీలకు 0.4 శాతం (83,215), 0.5 శాతం (95,364) ఓట్లు లభించాయి. 7 శాతం (14,50,456) ఓట్లతో బీజేపీ 1 సీటును గెలుచుకోగా, 2.7 శాతం (5,61,089) ఓట్లతో మజ్లిస్ 7 సీట్లను సాధించింది. స్వతంత్రులు 1, ఫార్వర్డ్‌బ్లాక్ 1 సీట్లు గెలుచుకున్నాయి. పోటీలో ఉన్న వారెవరూ నచ్చలేదంటూ 'నోటా'కు ఓటేసిన వారి సంఖ్య ఈసారి 1.1 శాతానికి (2,24,709) పెరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ జనాకర్షణ, ఆయన ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెద్ద వ్యతిరేకతేమీ లేకపోవటం, ఉన్న అసంతృప్తిని ఓటుగా మలచుకునే స్థాయిలో ప్రజాకూటమి వ్యవహరించలేకపోవటం, ప్రత్యామ్నాయ ఎజెండాను చూపకుండా స్కీముల మీదే ఆధారపడటం, పార్టీలకతీతంగా ప్రొఫెసర్ కోదండరాంలాంటి వారి సేవలను ఉపయోగించుకునే ప్రయత్నం చేయకుండా సీట్ల కుమ్ములాటల్లో భాగం చేయటం, చివరకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సభలో ఏపీ ప్రత్యేకహోదా గురించే తప్ప విభజన చట్టంలో తెలంగాణకు రావాల్సిన అంశాలు ప్రస్తావన చేయకపోవటం, తెదేపా అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి ఆధిపత్య ధోరణి, ఏపీ నుంచి వచ్చి స్థిరపడినవారిని కులసంఘాలుగా విడగొట్టి సమావేశాలతో టీఆర్ఎస్ ఆకట్టుకోవటం వంటి కారణాల వల్ల ఓటర్లు రెండోసారి పెద్దఎత్తున టీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. గెలుపోటముల తీరుతెన్నులపై ఓటర్ల జాబితాల గల్లంతు, నోటా సహా వివిధ కారణాలపై ఇంకా లోతైన విశ్లేషణ జరగాల్సి ఉన్నా.. టీఆర్ఎస్ ఘనవిజయాన్నయితే అందరూ అంగీకరించాల్సిందే. విజయోత్సవ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాలలో గుణాత్మక మార్పు రావాల్సి ఉందని, ఫెడరలిజం బలపడి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు రావాలని, నూతన ఆర్థిక, సామాజిక నిర్మాణం అవసరమని, ఇందుకోసం మజ్లిస్‌తో కలిసి కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రాంతీయ పార్టీలతో ఒక కొత్త జాతీయపార్టీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.


ఇక ఇదేసమయంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో విపక్ష కాంగ్రెస్ గణనీయ విజయాల్ని సాధించి దాదాపు ఏడాది కింద బాధ్యతలు చేపట్టిన తన అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి వార్షికోత్సవ కానుకగా అందించింది. మిజోరాంలో మాత్రం అధికారాన్ని కోల్పోయింది. బీజేపీ తనకు పట్టున్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో దాదాపు 179 ఎమ్మెల్యే స్థానాలను కోల్పోయింది. వీటిలో కాంగ్రెస్ 164 స్థానాలను సొంతం చేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌లోని మొత్తం 90 స్థానాల్లో బీజేపీ బలం మూడొంతులు పడిపోయి కాంగ్రెస్‌కు 68 సీట్లు దక్కాయి. ఇక్కడ 85 స్థానాల్లో అభ్యర్థుల్ని నిలబెట్టిన ఆమ్‌ఆద్మీ పార్టీకి 0.9 శాతం ఓట్లురాగా, నోటాకు 2.1 శాతం ఓట్లు పడ్డాయి. వాస్తవానికి స్థానిక అంశాలు, రాష్ట్ర స్థాయి పాలన, నాయకత్వం చుట్టూనే ఈ ఎన్నికలు జరిగినా.. మోదీ చేపట్టిన నోట్ల రద్దు వల్ల నగదు చెలామణి దెబ్బతినటం, ఇంత చేసినా దాని వల్ల ఎటువంటి ప్రయోజనమూ కనిపించకపోవటం, వ్యవసాయ పంటలకు మంచి ధరలు వచ్చేలా కేంద్రం ఎగుమతులు-దిగుమతుల విధానాన్ని అవలంబించకపోవటం తదితరాలు కూడా బీజేపీ రాష్ట్ర నాయకత్వాల్ని దెబ్బతీశాయి. పంటలు బాగా పండినా సరైన ధరలు లేకపోవటం పట్ల రైతులు, ఉపాధి లేని యువత ఆగ్రహం వెల్లుబకటంతో గ్రామీణ ప్రాంతాల్లో బాగా బలం పుంజుకోవటంతోపాటు పలు పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ పాగా వేయగలిగింది. ❒

### సంస్కరణల ప్రయత్నానికి మద్దతిస్తాం: జేపీ

తెలంగాణలో బలమైన విజయాన్ని సాధించిన కేసీఆర్, టీఆర్ఎస్‌లను, ఉత్తరాది రాష్ట్రాల్లో గెలిచిన కాంగ్రెస్‌ను, నేతలను, ఎంపీలో చౌహాన్ పనితీరును లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ అభినందించారు. దేశంలో గుణాత్మక మార్పును తెచ్చే నూతన విధానాలు కావాలని, అధికారాన్ని వికేంద్రీకరించి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలివ్వాలని విజయోత్సవ సమావేశంలో కేసీఆర్ చెప్పిన మాటలను స్వాగతించారు. ఈ సంస్కరణల సాధనలో లోక్‌సత్తా, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) పూర్తి సహకారాన్ని అందిస్తాయని జేపీ తెలిపారు.

# ఎన్నికల్లో ధనప్రవాహం - ఊబిలో పార్టీలు - సంక్షోభంలో సమాజం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



ప్రస్తుతం తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాలలో ఎన్నికల తీరుని చూస్తే మన ప్రజాస్వామ్య ప్రక్రియ రాజ్యాంగ విలువలకి ఎంత దూరమయి పోయిందో బోధపడుతుంది.

తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలకి ఎన్నిక జరుగుతుంటే, ఇప్పటికే ఎన్నికల సంఘం, అధికారులు రూ.103 కోట్లకి పైగా డబ్బుని ఓట్ల కొనుగోలు కోసం అక్రమంగా ఖర్చు చేస్తున్నారన్న కారణంగా స్వాధీనం చేసుకున్నారు. అంటే ప్రతి నియోజకవర్గానికి సగటున దాదాపు కోటి రూపాయలు ఇప్పటికే స్వాధీనమయింది. ఇంకా ఎన్నికలు జరగటానికి వారం రోజులుంది (ఈ వ్యాసాన్ని నవంబరు 30న ఢిల్లీ నుంచి హైదరాబాదు విమానంలో వ్రాస్తున్నాను). ఎన్నికల్లో అక్రమ ఖర్చు చేసే డబ్బులో కేవలం 2 నుంచి 3 శాతం డబ్బు మాత్రమే పట్టుబడుతుందని, అధికారుల సోదాలలో దొరికి ప్రభుత్వ స్వాధీనమయ్యే డబ్బు మొత్తం ఓట్ల కొనుగోలు, ఇతరత్రా ఖర్చులో చాలా కొద్దిశాతం మాత్రమేనని మనందరికీ తెలుసు.

అంటే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ప్రధాన పార్టీలు, వారి అభ్యర్థులు దాదాపు రూ.3,000 కోట్ల వరకు కనిపించని అక్రమ ఖర్చుని పెడుతున్నారని అంచనా వేయవచ్చు. బరిలో మూడు ప్రధాన పక్షాలు – తెలంగాణ రాష్ట్ర సమితి, కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న ప్రజాకూటమి, భారతీయ జనతా పార్టీ – ఉన్నాయి. ఇవికాక హైదరాబాదు నగరంలో 8 నియోజకవర్గాలలో బలంగా ఉన్న ఎం.ఐ.ఎం, ఇతర నియోజకవర్గాలలో బలమైన తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కొందరు, డబ్బుని విచ్చలవిడిగా ఖర్చు పెట్టే ఇతర పార్టీల కొందరు అభ్యర్థులు – అందరూ కలిస్తే, బహుశా 400 మంది సంప్రదాయ రాజకీయ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సగటున వీరంతా ఒక్కొక్కరు రూ.5 కోట్ల నుంచి 10 కోట్ల దాకా ఖర్చు పెడుతున్నారు. కొన్ని నియోజకవర్గాలలో రూ. పది, పదిహేను కోట్ల దాకా కొందరు అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అయినా సగటు ఖర్చు తీసుకుంటే రూ.3,000 కోట్లు ఎన్నికలలో ఖర్చు పెట్టటం వాస్తవానికి దగ్గరగా ఉండే అంచనా.

మరి చట్టం నిర్దేశించిన ఎన్నికల వ్యయం పరిమితి ఎంత? ఒక్కొక్క నియోజకవర్గంలో ఓ అభ్యర్థికి 28 లక్షల రూపాయల పరిమితిని చట్టం నిర్దేశిస్తోంది. అంటే 400 మంది 'గట్టి' అభ్యర్థులున్నారనుకుంటే, వారు పెట్టాల్సిన మొత్తం ఖర్చు పరిమితి రూ.112 కోట్లు. కాని వారు పెడుతున్న ఖర్చు అంతకు 30 రెట్లు.


ఇది కేవలం తెలంగాణ రాష్ట్రానికి పరిమితం కాలేదు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో ఇదే పరిస్థితి ఉంది. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికలలో రూ.5,000 కోట్ల వరకు ఖర్చయిందని అంచనా! దక్షిణాదిన మొదలయిన ఈ భారీ ఎన్నికల ఖర్చు ఇప్పుడు దేశంలో దాదాపు అన్ని ప్రాంతాలకీ విస్తరిస్తున్నది. ఇంకా కేరళ, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలలో ఓట్ల కొనుగోలు, భారీ ఖర్చు లేవు. బీహార్, తూర్పు ఉత్తర ప్రదేశ్ లాంటి ప్రాంతాలలో ఓ అసెంబ్లీ అభ్యర్థి రూ.1 – 2 కోట్లు ఖర్చు చేస్తే భారీగా ఖర్చు పెట్టినట్లు లెక్క. ఒరిస్సాలో సైతం ఈసారి రూ.3 – 5 కోట్ల దాకా ప్రతి అభ్యర్థి ఖర్చు చేస్తారని ఊహాగానాలున్నాయి. చివరికి జమ్ము–కాశ్మీరు లాంటి రాష్ట్రంలో కూడా ఓట్ల కొనుగోలుకి కోట్ల రూపాయలు ఖర్చు చేయటం ఆనవాయితీ అయింది.

ఈ నేపథ్యంలో ఎన్నికలలో గట్టి పోటీనివ్వాలంటే ఓ అభ్యర్థికి భారీగా డబ్బు ఖర్చు పెట్టే శక్తి మొదటి అర్హతగా రూపొందింది. పార్టీ ఏమిటి, దాని సిద్ధాంతాలేమిటి, ఎన్నికల ఎజెండా ఏమిటి, సమాజ భవిష్యత్తు పట్ల ఆ అభ్యర్థి ఆలోచన,

అవగాహన ఏమిటి – ఇవన్నీ అనవసరమయిన అంశాలుగా మారిపోయాయి. బాగా డబ్బు, కులం బలం ఉంటే రాజకీయ ప్రవేశం, ఎన్నికలలో పోటీ సహజమయిన కార్యక్రమాలుగా రూపొందాయి.

ఈ ఖర్చు మాత్రమే కాదు.. ఒక ప్రధాన పార్టీకి ఒక్కో నియోజకవర్గంలో సగటున 200 మంది కార్యకర్తలు సంవత్సరం పొడుగునా, అయిదేళ్ళపాటు ఏదో ఒక రూపంలో పార్టీ కార్యక్రమాలు నడపటానికి, పార్టీ జండా పట్టుకోవటానికి, ప్రచారం చేయటానికి, ప్రజలని తరలించటానికి, అన్నిటికీమించి ప్రజలకి ప్రభుత్వంతో ఏ చిన్న అవసరం ఉన్నా వారికి అండగా ఉండి, మధ్యవర్తులుగా, పైరవీకారులుగా పనిచేయటానికి అవసరం. ఆ స్థాయిలో కార్యకర్తలు ఉంటే మాత్రమే ప్రజలకి అందుబాటులో ఉండి పనులు చేయించటానికి రోజువారీ సాయం చేయటం సాధ్యం. సామాన్య ప్రజలకి ఈ మధ్యవర్తుల అండలేకుండా చిన్నపని కూడా సాధ్యంకాని పరిస్థితి నెలకొని ఉంది.

ఇక జనన, మరణ పత్రం కావాలన్నా, భూమి రికార్డులు కావాలన్నా, భూమి సరిహద్దులు సర్వే చెయ్యాలన్నా, ఇంటి నిర్మాణం అనుమతి కావాలన్నా, ఇంటికి నీటి కనెక్షను, లేదా విద్యుత్తు కనెక్షను కావాలన్నా, ప్రభుత్వంలో మరే చిన్నపని కావాలన్నా రాజకీయ పార్టీ కార్యకర్తల అండలేకుండా, పదిసార్లు తిరగకుండా, సిఫారసు లేకుండా, లంచం ఇవ్వకుండా పని జరిగే పరిస్థితి దాదాపు లేదు. అధికారుల్ని చేరుకోలేక, ఉద్యోగులతో పోట్లాడి నష్టపోలేక, ప్రజలు రాజకీయ పార్టీల కార్యకర్తల మీద ఆధారపడవలసి వస్తోంది. ఓటుని కోరి అధికారం కోసం పోటీపడుతున్నారు కాబట్టి పార్టీలు, వారి కార్యకర్తలు ప్రజలకి నిరంతరం



చిన్నపనుల కోసం కూడా అందుబాటులో ఉండాల్సి వస్తోంది. ఒక డ్రెయిను పొంగి పొర్లుతుంటే, ఎవరో ఒకరు పార్టీ కార్యకర్తల పూనుకుంటేనే పని జరుగుతోంది. ఇంటికి మంచినీరు రాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి విద్యుత్తుకి అంతరాయం వచ్చినా, మంచినీళ్ళలో మురుగునీరు కలుస్తున్నా, ఇంటెదురుగా ఉన్న రోడ్డు పూర్తిగా చెడిపోయి నడ్డి విరుగుతున్నా రాజకీయ పార్టీల కార్యకర్తలు పూనుకోవాల్సిందే. ఓట్ల కోసం పార్టీలు ఈ ప్రయాస పడవలసిందే.

మరి శాసనసభ నియోజకవర్గంలో 200 మంది కార్యకర్తలు వారికి వేరే సొంత ఆదాయం లేకుండా పార్టీ కోసం దాదాపు పూర్తికాలం పనిచేస్తుంటే, వారి పోషణ ఎట్లా?

ఎంత తక్కువ వేసినా ఒక కుటుంబం మనుగడ సాగించాలంటే నెలకి కనీసం రూ.15,000 ఖర్చు తప్పదు. అంటే ఒక్కో నియోజకవర్గానికి, ఒక్కో పార్టీకి నెలకి రూ.30 లక్షలు, ఏడాదికి రూ.3 నుంచి 4 కోట్లు దాకా అవసరం! అయితే బాగా డబ్బున్న నాయకులు తమ రాజకీయానికి పెట్టుబడిగా అంత డబ్బు ఖర్చు పెట్టి, ఆ తరువాత ఎన్నికలలో నెగ్గి అధికారం స్వంతమయితే ఆ పెట్టుబడిని వడ్డీ, లాభాలతో సహా వివిధ రూపాలలో రాబట్టుకోవాలి. లేదా, కార్యకర్తలు తామే స్థానికంగా సంపాదించుకోవటానికి వీలుగా అధికారాన్ని వినియోగించాలి. అంటే రేషన్ షాపుల కేటాయింపు, దానిలో సరకులు మళ్ళించి

అక్రమంగా అమ్ముకోవటం, చిన్న కాంట్రాక్టులు, అధికారుల, ఉద్యోగుల బదిలీకి డబ్బులు, పోలీసు కేసుల్లో జోక్యం చేసుకుని మామూళ్ళ వసూళ్ళు, చిన్న వ్యాపారులు, పొట్ట చేత పట్టుకుని బతుకుతెరువు కోసం తపించే సామాన్యుల దగ్గర మామూళ్ళు, అక్రమ నీటికనెక్షన్లు, విద్యుత్ కనెక్షన్లు, భూమి ఆక్రమణల ద్వారా లంచాలు, మామూళ్ళు – ఈ రూపంలో కార్యకర్తల జీవనోపాధికి మార్గాలు చూపవలసి వస్తోంది!

ఇలా మన రాజకీయ వ్యవస్థ ఒక విషవలయంలో కూరుకుపోయింది. రాజకీయ ఖర్చు అంటే, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, ఇతర అక్రమాలు, బహిరంగ సభలకి ప్రజల రవాణా లాంటి ఖర్చులకి రూ.5 – 10 కోట్లు, ఆపైన పెట్టే ఖర్చు కాకుండా, ఆ పార్టీ కార్యకర్తల పోషణకి ఐదేళ్ళ కాలంలో రూ.15 కోట్ల ఖర్చన్నా నియోజకవర్గంలో పెట్టుబడిగా పెట్టాలి; లేదా ఆ మేరకు అక్రమ సంపాదనకి మార్గాలనయినా కార్యకర్తలకి ఒక్కో నియోజకవర్గంలో చూపెట్టాలి. లేకపోతే రాజకీయానికి మనుగడ, ఎన్నికలలో బలమైన పోటీ దాదాపు అసాధ్యం!

అయితే ఎన్నికల్లో ఓట్లు కొని, పార్టీ కార్యకర్తలని పోషించినంత మాత్రాన గెలుపు సాధ్యమా? ఆ భరోసా ఏమీ లేదు. అధికారం కోసం గట్టి పోటీ పడుతున్న అభ్యర్థులంతా ఇదేరీతిని అనుసరించటం అనివార్యమయింది. అలాంటప్పుడు ఖర్చు చేసిన మాత్రాన గెలుపు గ్యారంటీ ఏమీ లేదు. కాని ఆ స్థాయిలో ఖర్చు పెట్టకపోతే ఓటమి ఖాయం! ఈమధ్య స్వయంకృషితో పైకొచ్చిన ఒకాయన నా దగ్గరకు వచ్చి, స్వపరిచయం చేసుకుని, ఎన్నికల్లో సీటు సంపాదించి శాసనసభ్యుడు కావాలన్న కోరిక ఉన్న పాపానికి ఎన్నికలకి రెండు, మూడేళ్ళ నుంచి ఎంత ఖర్చు చేయాల్సి వస్తోందో, ప్రతి గ్రామంలో ప్రజలు ఎంతగా వివిధ కార్యక్రమాలకి అలాంటి 'నాయకుల' నుంచి డబ్బుని, సహాయాన్ని ఆశిస్తున్నారో, ఖర్చు చేయకపోతే – "అంతగా డబ్బు లేకపోతే, రాజకీయంలోకి ఎందుకొచ్చావు?" – అని నిగ్గదీస్తున్నారో చెప్పి వాపోయాడు! ఇంత ఖర్చు పెట్టాక వచ్చే ఎన్నికలో పార్టీ సీటు ఇస్తుందన్న గ్యారంటీ లేదు; సీటు వచ్చాక ఓ రూ.10 కోట్లు దాకా ఖర్చు చెయ్యాల్సిందే; అంత కష్టపడినా, ఖర్చు చేసినా ఎన్నికలో నెగ్గుతామన్న గ్యారంటీ లేదు!

ఇది మన ఎన్నికల రాజకీయం నిజస్వరూపం. పార్టీలని, శాసనసభ్యులని, పార్లమెంటు సభ్యులని, అభ్యర్థులని తిట్టిపోయటం చాలా తేలిక. కాని ఇది పునాదులు లేని ప్రజాస్వామ్యంలో మనం చేసిన తప్పిదాల పర్యవసానం. మరికొన్ని చోట్ల ఇవేమీ లేకుండా కొందరు అభ్యర్థులు లేదా ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ నెగుతున్నారు కదా? అన్ని చోట్ల అలా ఎందుకు జరగకూడదు? ఈ ప్రశ్నకి సమాధానం అవసరం. కొన్ని సందర్భాలలో ఒక అభ్యర్థి చరిత్ర, గతంలో సాధించిన విజయాలు, నైతికస్థాయి, విశ్వసనీయత, ఆయన/ఆమెపై సమాజంలో ఆరాధనాభావం ఉన్నప్పుడు కొందరు నెగ్గవచ్చు. కాని వారి నుంచి కూడా ప్రజలు ఆశించేది ఇతర రాజకీయ పార్టీల తీరున తమకి నిరంతరం అండగా ఉండే కార్యకర్తల్ని ఏర్పాటు చేసి పనులు రోజువారీ చేయించి పెట్టాలని. చివరికి అది నిలబడే రాజకీయం కాదు. అయితే కొంతకాలానికి ఆ రాజకీయం క్షీణిస్తుంది; లేదా సంప్రదాయ రాజకీయంగా మారిపోయి, ఇతర పార్టీల తీరునే పనిచేస్తుంది. ఢిల్లీలో ఆప్ విజయం భవిష్యత్తుకి ఒక ఆశారేఖ. కాని అదికూడా ప్రత్యేక పరిస్థితుల్లో వచ్చింది. ఢిల్లీ నగరం తలసరి ఆదాయం దేశంలో ఇతర ప్రాంతాల కంటే ఐదు రెట్లు ఎక్కువ. అలా నగరాలలో ఆదాయం, అవగాహన పెరిగిన నేపథ్యంలో సంప్రదాయ రాజకీయానికి అతీతంగా ఆలోచించి ఓటు వేసే వారి శాతం పెరుగుతుంది. దేశంలో మహానగరాలలో, విశ్వసనీయత, చరిత్ర ఉన్న పార్టీలకి 10 శాతం పైగా ఓట్లు పడే అవకాశం ఉంది. ఢిల్లీలో తలసరి ఆదాయం మరింత ఎక్కువ కావటం, దేశంలో అన్ని ప్రాంతాల నుంచి వలస వచ్చినవారి సంఖ్య ఎక్కువగా ఉండి, కులం, ప్రాంతాల ప్రభావం తక్కువగా ఉండటం వల్ల 15–20 శాతం దాకా అలా ఓటు పడే అవకాశం ఉంది. అన్నింటినీ మించి, ఢిల్లీ ఒక నగరరాజ్యం. పేరుకి ఢిల్లీకి ఒక మంత్రివర్గం, ముఖ్యమంత్రి ఉన్నా, నిజానికి ఢిల్లీ ముఖ్యమంత్రి దేశంలో అతిఎక్కువగా స్వేచ్ఛ, అధికారం ఉన్న ఒక నగర మేయరుతో సమానం. నిజానికి ఇతర దేశాలలో మేయర్లకి ఢిల్లీ ముఖ్యమంత్రి కంటే ఎక్కువ అధికారం, బాధ్యత ఉన్నాయి. పరిమితంగానయినా ఢిల్లీ ప్రభుత్వానికి అధికారం, స్వంత వనరులు ఉండటంతో, ప్రజలకి తమ ఓటు వల్ల ఓ పార్టీ నగరంలో నెగ్గితే ఎన్నికల అనంతరం నిర్దిష్టమయిన, కోరుకున్న

మార్పులు వస్తాయన్న నమ్మకం ఉంది. అందుకే ఆ ఓటు 30–40 శాతానికి పెరిగి విజయం సాధ్యమయింది. అదే ముంబై, చెన్నై, హైదరాబాదు, బెంగళూరు లాంటి నగరాలలో మార్పు కోసం ప్రజలు ఓటు వేసినా, రాష్ట్రమంతా నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యకపోతే ఓటు వల్ల మార్పేమీ కనిపించదు. అందుకే అది 10 శాతం ఓటు దగ్గర ఆగిపోతుంది.

ఎన్నికలని, రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేస్తే జరిగే అనర్థం ఏమిటో వర్ణించటం ఈ వ్యాసంలో నా లక్ష్యం కాదు. జరుగుతున్న నష్టం, అవినీతి, దుష్పరిపాలన మనందరికీ తెలుసు. కాని ఎందుకు పార్టీలు, అభ్యర్థులు ఈ ఊబిలో కూరుకుపోయారో అర్థం చేసుకుంటే అప్పుడు ఈ సంక్షోభానికి పరిష్కారం బోధపడుతుంది. లేకుంటే పరిస్థితి రోజురోజుకీ ఇంకా జటిలమవుతుంది. డబ్బు ఖర్చు చేస్తే కేవలం ఎన్నికల బరిలో పోటీలో ఉంటున్నారు; కానీ గెలుపు గ్యారంటీ లేదు. కాబట్టి పార్టీలు పదుల వేల కోట్ల తాయిలాలు ప్రజలకి అందివ్వాల్సి వస్తోంది. తెలంగాణలో కొత్తగా ఇచ్చిన హామీల ఖర్చు ఏడాదికి రూ. 35,000 కోట్ల దాకా ఉంటుందని అంచనా. అదీచాలక కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో ప్రజల్ని విడదీసి, ద్వేషాన్ని, అసూయని రెచ్చగొట్టి, ఓటు బ్యాంకులుగా మార్చుకునే రాజకీయం వర్ధిల్లుతోంది.

ఎవరు నెగ్గినా చివరికి ప్రజలు, ప్రజాస్వామ్యం ఓడిపోతున్నారు. మహారాష్ట్రలో మరాఠాలకి 16 శాతం రిజర్వేషను ప్రతిపాదిస్తూ చట్టసభలు ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం ఇందుకు తాజా ఉదాహరణ.

వేగంగా ఆప్ లాంటి ప్రయోగాలు దేశమంతా విస్తరిస్తాయనుకుంటే అది పొరపాటే. 2013లో లోక్‌సత్తా పార్టీకీ బెంగళూరు నగరంలో అసెంబ్లీ ఎన్నికలలో ఒక్కో సీటుకి 5,000 – 12,000 దాకా ఓట్లు వచ్చాయి. అదే 2018లో, ఆప్ అభ్యర్థులు అంతకంటే గట్టిగా పోటీలోకి దిగినా, అందులో నాలుగోవంతు మాత్రమే ఓట్లు వచ్చాయి! అంటే కాలం గడిచినకొద్దీ రాజకీయం మరింత జటిలమై సంక్షోభం ముదిరిపోతోంది.

కాలక్రమేణా ఈ పరిస్థితి మారి ప్రజాస్వామ్యం బలపడవచ్చు. కాని అందుకు కొన్ని దశాబ్దాలు పట్టొచ్చు. 1946లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కి దీటుగా దేశమంతటా ప్రత్యామ్నాయ శక్తులు వచ్చి ప్రతి రాష్ట్రంలో రాజకీయ పోటీ రావటానికి దాదాపు 40 ఏళ్ళు పట్టింది. ఇప్పుడు ప్రతి రాష్ట్రంలో గట్టిగా పాతుకుపోయి, బలంగా పోటీ ఇచ్చే పార్టీలు కనీసం రెండయినా ఉన్నాయి. అవన్నీ కొన్ని చోట్ల తప్ప, దాదాపు ఒకేరీతిన రాజకీయం చేస్తున్నాయి. నిజానికి పార్టీల పేరు, జండా, ఎన్నికల గుర్తు వేరన్న మాటేగాని, ఎవరు ఏ పార్టీలో ఉన్నారో చప్పున చెప్పాలంటే సాధ్యం కానంతగా పార్టీలున్నాయి. కొందరు సంపన్నుల పదవీకాంక్షకి వేదికలుగా పార్టీలున్నాయి. ఎవరు నెగ్గుతారనే ఉత్కంఠ తప్ప, ఎవరు నెగ్గినా రాజకీయ మౌలిక స్వభావం మారే పరిస్థితి లేదు, కొద్దిపాటి మార్పులతో యథాస్థితి కొనసాగుతోంది. అలాంటప్పుడు కొన్నేళ్ళలో ఎలాగోలా ఇదంతా అప్రయత్నంగా బాగుపడుతుందని ఆశించటం అవివేకం. 49 పెద్ద దేశాలలో ప్రతి రంగంలో మనదేశం చివరి ఐదు స్థానాలలో ఉంది. మన సరసన చివర ఉన్న దేశాలు పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా!

సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక వ్యవస్థ, కొత్త పెట్టుబడులు, కొంతమేరకు మౌలిక సదుపాయాలు పెరుగుతున్నాయి; మేలు జరుగుతోంది. కాని రాజకీయం క్షీణించటంతో బీదరికం కొనసాగుతోంది; అంతరాలు పెరుగుతున్నాయి; ద్వేషం, అనుమానం, రెచ్చగొట్టే ధోరణులు ప్రబలిపోతున్నాయి; సమాజం సంక్షోభంలో కూరుకుపోతోంది. ఈ సంక్షోభానికి పరిష్కారాలున్నాయి; కాని రాజ్యవ్యవస్థలో మౌలిక మార్పులు తెచ్చి ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేస్తే తప్ప మన బిడ్డల భవిష్యత్తుని కాపాడలేము. ❐

#Bapu 150

**"మానవశక్తి మనలను సముద్ధరించాలి, నాశనం చేయకూడదు"**

– గాంధీజీ

# కట్టలు తెగిన డబ్బుకి పాలమూరే సాక్షి.. గతంలో ఒక ఎన్నికకయ్యే ఖర్చు ఇప్పుడు ఓ సభకు

**- ఎన్నికల ప్రచార సమయంలో మహబూబ్‌నగర్ నుంచి**
ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ సురేష్ రిపోర్ట్




**ఉ**మ్మడి మహబూబ్‌నగర్ జిల్లా... తెలంగాణలో అత్యంత వెనుకబడిన ప్రాంతం. అంతేకాదు... తెలంగాణ మిశ్రమ రాజకీయ, సామాజిక సంస్కృతికి ఈ జిల్లా ఒక ప్రతీక. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ రకాల పరిస్థితులు ఒక్క పాలమూరులోనే కనిపిస్తాయి. ఇక్కడ టీఆర్ఎస్ ఉంది, కాంగ్రెస్ ఉంది, తెలుగుదేశం ఉంది, బీజేపీ ఉంది. ఆంధ్రా సరిహద్దు ప్రాంతం ఉంది, ఆంధ్రకు దూరంగా ఉండే ప్రాంతమూ ఉంది. సెటిలర్లు ఉన్నారు, స్థానికులూ ఉన్నారు. కరువు ఉంది, నీరు నిండిన చెరువులూ ఉన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ఇది మినీ తెలంగాణ. ఎన్నికల ప్రచారం ముగుస్తున్న తరుణంలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఇక్కడ పర్యటించినప్పుడు అనేక దృశ్యాలు కనిపించాయి. టీఆర్ఎస్, మహాకూటమి మధ్య హోరాహోరీగా సాగుతోందని చాటి చెప్పే దృశ్యాలు కొన్ని! ఈ ఎన్నికల్లో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాల ప్రభావం ఎంతగా పెరిగిపోయిందో, డబ్బు లేని అభ్యర్థి ఎలాంటి దుస్థితిలో ఉన్నాడో తెలిపే దృశ్యాలు మరికొన్ని!!

- ✦ జడ్చర్ల నియోజకవర్గం నవాబ్‌పేటలో ఒక ప్రధానపార్టీ నేత ఇంటిని ఆంధ్రజ్యోతి ప్రతినిధి సందర్శించారు. ప్రచారానికి బయల్దేరే ముందు పార్టీ కార్యకర్తలు ఓ వాహనంలో అక్కడికి వచ్చారు. ఆయన తన ఇంట్లోకి వెళ్లి డబ్బులు తీసుకొని వచ్చి తలా ఐదొందలు ఇచ్చారు. వాళ్లు ఉత్సాహంగా ప్రచారానికి బయల్దేరారు. నియోజకవర్గంలో గ్రామస్థాయి నేతలకు నెలరోజుల కిందటే ప్రచారానికి డబ్బులు అందాయి. దాంతోపాటు ఏరోజుకు ఆరోజు కొంత సొమ్ము ఇస్తున్నారు.
- ✦ రెండు నెలల క్రితమే అభ్యర్థులను ప్రకటించిన టీఆర్ఎస్‌కు క్షేత్రస్థాయిలో చక్కదిద్దుకోవడానికి కావాల్సినంత సమయం చిక్కింది. ప్రజాఫ్రంట్ అభ్యర్థులను ప్రకటించే సమయానికి

నామినేషన్ల గడువు పూర్తయ్యే పరిస్థితి రావడంతో వారు గ్రామాల్లోకి వెళ్లేసరికి అప్పటికే టీఆర్ఎస్ నేతలు లోకల్ లీడర్లను ఆకట్టుకోవడం పూర్తయింది. అయితే టీఆర్ఎస్‌కు విజయం సులభం అన్న పరిస్థితి నుంచి కాంగ్రెస్ వారం రోజుల్లోనే గట్టి పోటీ ఇచ్చేంత స్థాయికి వచ్చింది.

✦ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం అక్కడక్కడ మొదలైంది. 200 ఇళ్లు అవసరమైన ఆదర్శ గ్రామం రుద్రారంలో 24 ఇళ్లు మాత్రమే కడుతున్నారు. పూర్తయ్యాక లాటరీ తీసి 24 మందికి ఇస్తారట. ఈ విషయంలో గ్రామస్తులు అసహనంతో ఉన్నారు. ఈ గ్రామంలో నాలుగేళ్లలో 9 మంది యువతులకు కల్యాణలక్ష్మి డబ్బులు వచ్చాయి. సహాయ మొత్తం లక్ష రూపాయలకు పెరిగిన తర్వాత ఒక్కటి కూడా రాలేదు. 12 మంది ఎదురుచూస్తున్నారు.

✦ మన్నన్‌గండ్లలో మిషన్ భగీరథ పైపులు నాసిరకానికి వేశారు. పలుచోట్ల లీక్ అవుతున్నాయి. పంపులు ఎన్నికల తర్వాత అమరుస్తామని చెప్పడం కోసం గ్రామాల్లో పైపులు తీసుకొచ్చి కుప్పగా వేశారు.

✦ వనపర్తి నియోజకవర్గం ఖిలాగణపవరం మండలంలో శ్రీశైలం బ్యాక్‌వాటర్‌తో చెరువులన్నీ నింపారు. ఆ మండలంలో చెరువులు నిండిన ప్రజలు ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారు. అయితే జడ్చర్ల రూరల్ మండలంలో కరువు తీవ్రంగా ఉంది. 24 గంటల కరెంటు ఉన్నా తోడడానికి బోర్లలో నీళ్లు లేవు. దాంతో నేతల సభలకు పిలవగానే పార్టీలకు అతీతంగా కూలీలు వెళ్లిపోతున్నారు.

✦ కొందరు రైతులు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేస్తున్నారు. మాఫీ అవుతుందన్న భరోసాతో వాయిదాలు కట్టలేదని, వడ్డీల మీద వడ్డీలు పెరుగుతూ ఉన్నాయని చెబుతున్నారు.

✦ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి ఇబ్రహీం ప్రధాన పార్టీ నేతలకు చెమటలు పట్టిస్తున్నారు. నాలుగుసార్లు ఓడిన ఆయన పట్ల మైనారిటీల్లో సానుభూతి ఉంది.

✦ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా ప్రభుత్వ ఉద్యోగులంతా ఇళ్లు కట్టుకొని ఉంటారు. దాదాపు 9000 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. ఉద్యోగ వర్గాలతో సన్నిహితంగా ఉండే ఒక నేతల ఇప్పటికే 1500 పోస్టల్ బ్యాలెట్లు కొనుగోలు చేశారని ఆరోపణలు వినవస్తున్నాయి.

✦ దేవరకద్రలోనూ ప్రచారంలో నోట్ల కట్టలు తెగుతున్నాయి. డబ్బులు లేనోళ్లు బరిలో నిలవడం అనవసరం అనే అభిప్రాయానికి అందరూ వచ్చేశారు. సభలన్నింటికీ తరలించిన ప్రజలే. ఒక పార్టీ సభకు వచ్చినవారే మరో సభకు వస్తున్నారు. కరువు రోజుల్లో సభకు వెళ్లినందుకు 200-300 వస్తున్నప్పుడు ఉపయోగించుకోవడంలో తప్పేముందని వారు అంటున్నారు. ప్రస్తుతం ఊరూరా రోజూ ఏదో ఒక నేత ఇంట్లో దావత్ జరుగుతూనే ఉంది.


✦ వనపర్తిలో ఒక అధికారి నిధుల తరలింపులో ఒక పార్టీకి రాచమార్గం ఉందని అంటున్నారు. బస్తీలు, కులాలవారీగా ఓట్ల కొనుగోలు జరుగుతోందని చెప్పారు.

✦ జడ్చర్ల పరిధిలోని నవాబ్‌పేటలో బీజేపీ నేత ఒకరు గతంలో ఒక ఎన్నికకు పెట్టిన మొత్తం ఇప్పుడు కేవలం ఒక సభకు పెట్టాల్సి వస్తోందని వాపోయారు. సభకు వెళ్లినా, ర్యాలీలో పాల్గొన్నా, గ్రామంలో తిరిగినా... భోజనాలు, మందు పంపిణీ జోరుగా సాగుతోంది.

✦ దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఒక అభ్యర్థి పార్టీ కార్యాలయం బయట మద్యం దుకాణం, కాకా హోటల్ ఉన్నాయి. వైన్స్‌లో చిట్టీ ఇచ్చేసి మద్యం తెచ్చుకోవాలి. హోటల్లోకి వెళ్లి ఆ మద్యం తాగాలి. కార్యాలయంలోకి వచ్చి భోజనం చేయాలి. ఇదీ పద్ధతి. ఆంధ్రజ్యోతి ప్రతినిధి కెమేరాకు ఆ దృశ్యం చిక్కింది కూడా. డబ్బు, మద్యం ప్రవాహాన్ని తట్టుకోలేని దేవరకద్ర బీఎల్ఎఫ్ అభ్యర్థి.. "డబ్బు తీసుకోండి, తినండి, తాగండి. ఓటు మాత్రం మాకే వేయండి" అంటూ బతిమాలుతున్నారు.

✦ మహబూబ్‌నగర్‌లో ఓ అభ్యర్థి డబ్బులు పంచడం లేదు కానీ "ఓడినా, గెలిచినా మీకు అండగా ఉంటాను. కష్టమేదైనా వస్తే వచ్చి డబ్బులు అడగండి. ఆదుకుంటా" అని ప్రచారం చేస్తున్నారు. ❒

# జాంబవంత అంగపై ప్రధాని జబ్బలు చరుచుకుంటుండగానే.. కట్టలు తెంచుకున్న నోట్లు




దేశంలోనే డబ్బు ఎన్నికలకు తెరతీసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒరవడినే 2018 ఎన్నికల్లో తెలంగాణ కొనసాగించింది. ఎన్నికల గడువు సమీపిస్తున్నకొద్దీ రూ.500, రూ.2,000 నోట్లు కట్టలు తెంచుకున్నాయి. తమిళనాడులోని ఆర్కేనగర్ ఉప ఎన్నికలో రూ.100కోట్ల వరకూ పట్టుబడ్డాయి కాబట్టి.. అంటూ గతేడాది డిసెంబర్‌లో ఆ ఎన్నికలను వాయిదా వేసినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. కానీ అలా తెలంగాణలో టీఆర్ఎస్, ప్రజాకూటమి, కొన్ని ఇతర పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు డబ్బులు పంచుతున్నట్టు వీడియో, మీడియా సాక్ష్యాలు కనిపిస్తున్నా, ప్రచారం మొదలైన కొద్దిరోజుల్లోనే రూ.100 కోట్లు పైనే పట్టుబడినా, 'సీ-విజిల్' యాప్ ద్వారా వేల ఫిర్యాదులు వచ్చినా, రికార్డుస్థాయిలో గత ఎన్నికల కంటే రెట్టింపు డబ్బుని ఈసారి వెదజల్లుతున్నారని పక్కా నివేదికలు వస్తున్నా కూడా.. ఎన్నికల సంఘం నీళ్లు నమిలింది తప్ప చర్యలు తీసుకోలేదు. శేషన్‌లాగా.. లేస్తే మనిషిని కాను అన్నట్టు కూడా అభ్యర్థుల్ని, పార్టీల్ని బెదిరించలేకపోయింది. అయితే తప్పు ఈసీది మాత్రమే కాదు.

ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని నియంత్రించటంలో ఈసీ విఫలమైందని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ఆమధ్య ఆడి పోసుకున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయటానికి ఈసీ 2004లో 22, 2016లో 47 సూచనల్ని ఇచ్చింది, గత కొన్ని నెలలుగా ఇంకొన్ని ప్రతిపాదించింది. వీటిలో ఆచరణసాధ్యమైనవి వెంటనే తీసుకోవచ్చు. అలాగే లా కమిషన్, లోక్‌సత్తా జేపీ సభ్యుడుగా ఉన్న పరిపాలనా సంస్కరణల సంఘం ఇచ్చిన సూచనలున్నాయి. రాజకీయ ఉద్యమంగా లోక్‌సత్తా ఇచ్చిన పలు హేతుబద్ధ సూచనల గురించి జైట్లీకి వ్యక్తిగతంగా కూడా తెలుసు. వీటిని అమలుచేయటం గురించి ఆలోచించకుండా ఈసీ మీద మితిమీరిన ఆరోపణలతో కాలక్షేపం చేయటం పలాయనవాదమవుతుంది. అందుకే నిబంధనలను ఆచరణాత్మకంగా పటిష్ట పరచటంతోపాటు.. రాజకీయ, పాలనా, ఎన్నికల సంస్కరణల దిశగా కృషి జరగాల్సుంది. చిల్లర నిబంధనలపై ప్రచారంతో సరిపెట్టకుండా.. ఈ బిగ్ టికెట్ సంస్కరణల కోసం ఈసీ కూడా తన వంతు భాగస్వామ్యంతో కృషి చేయాలి.


ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన పెద్దనోట్ల రద్దు (డీమానిటైజేషన్) ఓ భారీఅడుగు! ఈ జాంబవంత అడుగు

వల్ల ఆర్థిక వృద్ధి మరింత పడిపోయిందని, అసంఘటిత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని కేంద్ర మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) అరవింద్ సుబ్రమణియన్ కూడా తప్పుపట్టారు. 'ఆఫ్ కౌన్సెల్: ది ఛాలెంజెస్ ఆఫ్ ది మోదీ-జైట్లీ ఎనానమీ' పేరుతో తాను రాసిన పుస్తకంలో ప్రత్యేకంగా నోట్ల రద్దు అంశానికి ఆయన ఒక అధ్యాయాన్నే కేటాయించారు. 'డీమానిటైజేషన్ కుదుపును మనం తట్టుకోగలిగాం' అని కొందరు నిపుణులు అనునయ వాక్యాలు పలుకుతున్నా కూడా.. అది మన ఆర్థికవ్యవస్థను గట్టిగానే దెబ్బతీసింది. కానీ నోట్ల రద్దు సమయంలో మోదీ చెప్పిన లక్ష్యాలు అంతకంటే విలువైనవి. ఆర్థిక వ్యవస్థ తాత్కాలికంగా దెబ్బతిన్నా, వృద్ధి తగ్గినా సరే భరించి సాధించుకోదగినవి.

దేశం ఆర్థికంగా వెలిగిపోయిన వాజ్‌పేయి హయాంలో, ఆ తర్వాత రికార్డుస్థాయి వృద్ధి రేటును సాధించిందని చెప్పుకున్న మన్మోహన్ సింగ్ ప్రభుత్వ జమానాలో కోట్లాది సామాన్య, మధ్యతరగతి ప్రజల బతుకులు గొప్పగా ఏం మారాయి? జీడీపీ చర్చ, వృద్ధి ఒక్కటే సరిపోదని, జనం జీవితాలు బాగుపడి వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చే పాలన కూడా కీలకమని గుర్తిస్తే.. కొంత వృద్ధి నష్టాన్ని భరించైనా పాలనను బాగు చేసుకునే ప్రయత్నాన్ని తప్పుపట్టనక్కర్లేదు. ప్రజలు కూడా ఇందుకు సిద్ధపడ్డారు గనుకనే, మోదీ చర్యకు ఆమోదం తెలిపారు. చేతిలో డబ్బులాడక తాము ఇబ్బందులు పడ్డా, ఉపాధి కరువైనా.. అవినీతి అంతానికి మోదీ నిజాయతీగా ఏదో పెద్ద ప్రయత్నం చేస్తున్నారని ఆశపడి అసమర్థంగా అమలుచేసిన నోట్ల రద్దు కష్టాల్ని భరించారు. కానీ విషాదమేమంటే, కేవలం తొలి భారీ అడుగుతోనే మోదీ ఆగిపోవటం! నోట్ల రద్దు సమయంలో ప్రధానంగా ఆయనేం చెప్పారు- 'అవినీతి అంతానికి, నల్లధనాన్ని వదిలించటానికే నోట్ల రద్దు చేస్తున్నా'మన్నారు. కానీ అవినీతి అంతానికి ఒక్కటంటే ఒక్క సరైన చర్య తీసుకోలేకపోయారు. ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ పలుమార్లు ప్రధానమంత్రి దృష్టికి ఆ సంస్కరణల్ని తీసుకెళ్లారు. దేశంలోని వివిధ నగరాలలో సమావేశాలు నిర్వహించిన నిపుణుల ఏకాభిప్రాయాన్ని కూడగట్టి తీర్మానాల రూపంలో అందించారు. అయినా తనదైన శైలిలో మాత్రమే అవినీతిపై పోరాడతానన్నట్టు మోదీ తన ముక్కు దాటి చూడకుండా వ్యవహరించారు. హార్వర్డ్ చదువుల కన్నా తనకే ఎక్కువ తెలుసనే భ్రమనే పెంచి పోషించుకున్నారు. చివరికి.. 'అవినీతిపరులైన అధికారులపై కేసు నమోదు చేయటానికి కూడా ప్రభుత్వ అనుమతి కావాలి, గతిలేక రూ.100 లంచం ఇచ్చే పౌరులను మాత్రం కనిష్టంగా 3 ఏళ్లు, గరిష్టంగా 7 ఏళ్లు జైల్లో పెట్టాలి' అనే సవరణలను పార్లమెంటులో ఆమోదింపచేశారు. ఈ బాధ్యతారాహిత్యం, అపరిపక్వత వల్ల మోదీ పాలనాకాలం ముగిసే సమయానికి.. దేశంలో రోజువారీ లంచాలిచ్చేవారి సంఖ్య 45 నుంచి 56 శాతానికి పెరిగింది ('ఇండియా కరప్షన్ సర్వే 2018'). ఆ చేదునిజాన్ని అంతకంటే పచ్చిగా తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు రుజువు చేశాయి. "చెదల నివారణలో విషపూరిత మందుల్ని వాడే రీతిలోనే.. దేశంలో బలంగా వేళ్లూనుకుపోయిన అవినీతికి తగిన చికిత్స చేయడానికి చేదుమందుగా పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చిందని" మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచార సభలో మోదీ చెబుతున్న సమయంలోనే నోట్లు కట్టలు తెంచుకుని ప్రవహించాయి (మీడియా కవరేజీ క్లిప్పింగుల్ని ఫోటోలో చూడొచ్చు). ప్రధాని చెబుతున్నట్టు నోట్లరద్దు విజయవంతమై నల్లడబ్బు బైటపడి ఉంటే, ఈ కట్టలన్నీ ఎక్కడివి? ఇన్ని వేల కోట్ల నల్లధనం ఎక్కడ్నుంచి వచ్చింది?.. అవినీతి పోవాలనుకునే ప్రతి ఒక్కరూ నోట్ల రద్దుపై ఈ కోణాల్ని లోతుగా పరిశీలించాలి.

తెలంగాణ రాష్ట్రాన్నే తీసుకుంటే, దేశంలోనే డబ్బు ఎన్నికలకు తెరతీసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒరవడినే 2018 ఎన్నికల్లో తెలంగాణ కొనసాగించింది, మించిపోయింది కూడా. ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాన పార్టీలు ఒక్కో మనిషికి రూ.500/1000 + మద్యం, బిరియానీ, ఇతరత్రా సదుపాయాల్ని కల్పించిన సంగతి దాదాపు ప్రతి ఒక్కరికీ తెలుసు. ఎన్నికల గడువు సమీపిస్తున్నకొద్దీ రూ.2,000 నోట్లు కూడా కట్టలు తెంచుకున్నాయి. తమిళనాడులోని ఆర్కేనగర్ ఉప ఎన్నికలో రూ.100కోట్ల వరకూ పట్టుబడ్డాయి కాబట్టి.. అంటూ గతేడాది డిసెంబర్‌లో ఆ ఎన్నికలను వాయిదా వేసినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. కానీ అలా తెలంగాణలో టీఆర్ఎస్, ప్రజాకూటమి, కొన్ని ఇతర పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు డబ్బులు పంచుతున్నట్టు వీడియో, మీడియా సాక్ష్యాలు కనిపిస్తున్నా, ప్రచారం మొదలైన కొద్దిరోజుల్లోనే రూ.100 కోట్లు పైనే పట్టుబడినా (2014లో ఉమ్మడి ఏపీ ఎన్నికల్లో పట్టుబడింది రూ.76 కోట్లు మాత్రమే), 'సీ-విజిల్' యాప్ ద్వారా వేల ఫిర్యాదులు వచ్చినా, రికార్డుస్థాయిలో గత ఎన్నికల కంటే రెట్టింపు డబ్బుని ఈసారి వెదజల్లుతున్నారని పక్కా నివేదికలు వస్తున్నా కూడా.. ఎన్నికల సంఘం నీళ్లు నమిలింది తప్ప చర్యలు తీసుకోలేదు. శేషన్‌లాగా.. లేస్తే మనిషిని కాను అన్నట్టు కూడా అభ్యర్థుల్ని, పార్టీల్ని బెదిరించలేకపోయింది.

## తమిళనాట పని పూర్తయ్యాక ఈసీ ప్రతిపాదనకు 'నో' అన్న కేంద్రం




ఎన్నికల్లో డబ్బు పంపిణీ, ఇతర ప్రలోభాలకు పాల్పడితే ఆ ఎన్నికను రద్దు చేయటానికి తమకు పరిమిత అధికారాలే ఉన్నాయని, నల్లడబ్బు ఎన్నికలను సమర్థవంతంగా ప్రక్షాళన చేయటానికి అవసరమైతే 'ఓటుకు నోటు' తరహా ఎన్నికలను రద్దు చేసే అధికారం తమకు ఉండాలని ఈసీ వాదిస్తోంది. ఆర్కేనగర్ ఉప ఎన్నిక సమయంలో ఈ వాదన గట్టిగా వినిపించింది. అరుదైన విచక్షణాధికారం కాకుండా.. డబ్బు, ఇతర ప్రలోభాలు ఉండే ఎన్నికలను రద్దు చేయటానికి పూర్తిస్థాయి చటబద్ధ అధికారాలు తమకు ఉండాలని కోరింది. దీనిపై అప్పట్లో కేంద్రప్రభుత్వం కూడా సానుకూలంగానే స్పందించింది. తమిళనాడులో తాము ప్రత్యేక ప్రయోజనాన్ని ఆశించి జోక్యం చేసుకుంటున్నామని, కేంద్ర ప్రభుత్వ సంస్థల చేత దాడులు నిర్వహించి డబ్బు కట్టల్ని పట్టుకున్నామని విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. ఈసీ ప్రతిపాదన కేంద్రానికి ఇమేజ్ పెంచుకునే అవకాశంగా కనిపించింది. ఎన్నికల్లో అక్రమాలు జరిగితే ఆ ఎన్నికను రద్దు చేసి మరో తేదీలో నిర్వహించే అధికారం ఈసీకి కట్టబెట్టటంపై రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్రం కోరింది.

"ఎన్నికలను రద్దు చేయడానికి సెక్షన్ 324లో పరిమిత అధికారాలే ఈసీకి ఉన్నాయి. పైగా ఇలా చేసినా ఈ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సులువుగా సవాలు చేయవచ్చు. ఎన్నికల రద్దుపై 'ప్రజాప్రాతినిధ్య చట్టం-1951'లోని సెక్షన్ 58ని సవరిస్తేనే ఈసీకి ఈ విషయంలో అధికారాలు సమకూరతాయి. ఎన్నిక రద్దు చేయడానికి ఈసీకి శాశ్వతంగా అధికారాన్ని దఖలు పరిచేలా సెక్షన్-58 (ఎ), స్వేచ్ఛగా ఎన్నికలు జరిగే వాతావరణాన్ని ధనప్రలోభాలు ప్రభావితం చేస్తున్నాయని సంబంధిత రిటర్నింగ్ అధికారి నుంచి నివేదిక వస్తే ఆ ఎన్నికను వాయిదా వేయడానికి సెక్షన్-58 (బి)ని చేర్చాలని కేంద్రం యోచిస్తోంది" అని న్యాయమంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. ఇలా పోలింగ్ బూత్ స్థాయిలో కాకుండా మొత్తం నియోజకవర్గ ఎన్నికను రద్దు చేసేలా ఈసీకి అధికారాలు ఇవ్వాలా, వద్దా అని రాష్ట్రాలతో సంప్రదింపులు చేస్తున్నట్టు చెప్పాయి. కానీ ఆ తర్వాత తమిళనాట తన పని పూర్తయిందను కున్నాక.. కుదరదు అని తోసిపుచ్చింది.

ఇదేరీతిలో ఇంకొన్ని సిఫార్సుల్ని గత కొన్ని నెలలుగా ఈసీ కేంద్ర సర్కారుకు చేసింది..

- ✦ శిక్షార్హమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నవారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా చూడాలి.
- ✦ ఒక అభ్యర్థి ఒక స్థానం నుంచే పోటీ చేసేలా ఉండాలి. ఒకేసారి రెండు స్థానాల నుంచి పోటీ చేయడాన్ని నిరోధించాలి.
- ✦ ఓటరు జాబితాలో నమోదుకు జనవరి ఒకటవ తేదీని ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. జులై ఒకటో తేదీని కూడా పరిగణించాలి.
- ✦ ఇతర దేశాల్లో ఉంటున్న భారత పౌరులు ఆ దేశంలో పౌరునిగా లేకుండా ఇక్కడే ఓటరుగా ఉంటే ఓటుహక్కును వినియోగించేలా వారికి అవకాశం కల్పించాలి.
- ✦ రాజ్యసభ, శాసన మండలిలో విధిగా ప్రతి రెండేళ్లకు మూడో వంతు మంది సభ్యులు పదవీ విరమణ చేసేలా ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించాలి. మండలి ఎన్నికల్లోనూ రాజ్యసభలాగా చూపించి ఓటు వేయాలి.
- ✦ ప్రస్తుతం ఒక్కో ఈవీఎంలో ఓట్లను లెక్కించి తర్వాత అన్ని ఈవీఎంలలో ఓట్లను కూడుతున్నారు. ఇలాకాకుండా 14 ఈవీఎంలలో మొత్తం ఓట్లలో ఎవరికి ఎన్ని వచ్చాయని గుర్తించేలా టోటలైజర్లు ఉండాలి.
- ✦ చాలా రాజకీయ పార్టీలు రిజిస్టర్ చేసుకుని ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆదాయ పన్ను మినహాయింపు వంటి ప్రయోజనాలు పొందుతున్నాయి. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి.. సీట్లు దక్కించుకునే పార్టీలకు మాత్రమే ఐటీ మినహాయింపు ఉండాలి.
- ✦ శాసనమండలి అభ్యర్థులకు ఎన్నికల వ్యయపరిమితి ఉండాలి. ఇది అసెంబ్లీ స్థానం వ్యయపరిమితిలో సగం ఉండాలి.
- ✦ రాజకీయ పార్టీలు పొందిన నిధులు, వ్యయం వివరాలను తప్పక బహిర్గతం చేయాలి. ఈ లెక్కలను విధిగా ఆడిట్ చేయించాలి. 20వేల కంటే తక్కువ వచ్చిన విరాళాలనూ లెక్కల్లో చూపించాలి. రెండు వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలో అనామకులు ఇచ్చే విరాళాలను పార్టీలు తీసుకోకూడదు. రాజకీయ పార్టీలు అభ్యర్థులకు ఇచ్చే మొత్తం ఆ అభ్యర్థి ఎన్నికల వ్యయపరిమితిని మించకూడదు. ఎన్నికల ఖర్చు లెక్కలు అందచేయాల్సిన సమయాన్ని 20రోజులకు తగ్గించాలి.

- ఒపీనియన్ పోల్స్ లేదా ఎగ్జిట్ పోల్స్ మొదటి నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి అన్ని దశల ఎన్నికలు పూర్తయ్యే వరకూ బహిర్గతం చేయకూడదు.
- ఎన్నికల గడువుకు ఆర్నెల్ల ముందు నుంచే ప్రభుత్వ ప్రాయోజిత ప్రకటనలను నిషేధించాలి.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచే టీవీలు, పత్రికల్లో అభ్యర్థుల ప్రచార ప్రకటనలు రాకుండా చట్టంలో మార్పులు చేయాలి. చెల్లింపు వార్తల ద్వారా ప్రచారం చేసుకునేవారికి రెండేళ్లకు తగ్గకుండా శిక్ష పడేలా చట్టసవరణ చేయాలి.
- అభ్యర్థులకే కాకుండా పార్టీలకు కూడా ఎన్నికల వ్యయపరిమితి ఉండాలి.

### ఎన్ని ఎన్నికలను రద్దు చేయగలరు?

టీఎన్ శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడు ఆయనేమీ ఎన్నికల వ్యవస్థలో పెద్దమార్పుల్ని తీసుకురాలా. కేవలం ఉన్న అధికారాలను బలంగా వినియోగించుకోగలిగారు. ఈరోజున అలా ఓ అధికారి హడావుడి చేసినా కూడా ఆ స్థాయి ప్రభావం చూపటం సాధ్యం కాకపోవచ్చు. రోజులు మారాయ్ అందుకే ఎవరు అధికారిగా ఉన్నా పనితీరు సమర్థవంతంగా ఉండేలా.. వ్యవస్థీకృతమైన కొన్ని మార్పుల కోసం ఈసీ కృషి చేయటం మేలు. మేనిఫెస్టోల నియంత్రణ, నిబంధనల సక్రమ అమలు వంటివి ఈసీ తన చేతుల్లో ఉంచుకోవచ్చు. కానీ ఎన్నికల్లో నల్లధనం, ఓట్ల కొనుగోలు ఇంత పెద్దఎత్తున పెరిగిపోయి సాంకేతికతను వక్రమార్గాలకు వినియోగించు కుంటూ పరిస్థితి వికృతంగా తయారయ్యాక.. ఈసీ అనే రాజ్యాంగసంస్థకు పెద్దఎత్తున అధికారాల్ని కట్టబెట్టటం వల్ల పెద్దగా ప్రయోజనముండదు. ఇది ప్రమాదకరంగా కూడా పరిణమించవచ్చు. ఈసీ చర్యలతో కొనుగోళ్లు కొత్త మార్గాల్లో జరుగుతాయి. అప్పుడు.. ఎన్ని నియోజకవర్గాలలో ఎన్నికలను రద్దు చేయగలరు? ఇది ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయటానికి ఏదో ఘనకార్యం చేసినట్టు నైతికంగా గొప్పగా కనపడుతుంది గానీ, పెద్దగా ఫలితాలు ఇవ్వకపోవచ్చు. ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని నియంత్రించటంలో ఈసీ కూడా విఫలమైందని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ఆమధ్య ఆడిపోసుకున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయటానికి ఈసీ 2004లో 22, 2016లో 47 సూచనల్ని ఇచ్చింది, గత కొన్ని నెలలుగా ఇంకొన్ని ప్రతిపాదించింది. వీటిలో ఆచరణసాధ్యమైనవి వెంటనే తీసుకోవచ్చు. అలాగే లా కమిషన్, లోక్‌సత్తా జేపీ సభ్యుడుగా ఉన్న పరిపాలనా సంస్కరణల సంఘం ఇచ్చిన సూచనలున్నాయి. రాజకీయ ఉద్యమంగా లోక్‌సత్తా ఇచ్చిన పలు హేతుబద్ధ సూచనల గురించి జైట్లీకి వ్యక్తిగతంగా కూడా తెలుసు. వీటిని అమలుచేయటం గురించి ఆలోచించకుండా ఈసీ మీద మితిమీరిన ఆరోపణలతో కాలక్షేపం చేయటం పలాయనవాదమవుతుంది. అందుకే నిబంధనలను ఆచరణాత్మకంగా పటిష్ట పరచటంతోపాటు.. రాజకీయ, పాలనా, ఎన్నికల సంస్కరణల దిశగా కృషి జరగాల్సుంది. ఈ బిగ్ టికెట్ సంస్కరణల కోసం ఈసీ కూడా తన వంతు భాగస్వామ్యంతో కృషి చేయాలి.


### ఈ సంస్కరణలతోనే మార్పు

నల్లడబ్బు ప్రధానంగా రియల్ ఎస్టేట్, బంగారం లావాదేవీల్లో ఉండొచ్చుగానీ, వీటన్నిటి వెనకా ఎన్నికల విషవలయంలో చిక్కుకున్న రాజకీయ నేతలే కీలకం. ఓట్ల కొనుగోలు కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టాక, ఐదేళ్లలో అంతకు పదిరెట్లు ఆర్జించటం మనదేశంలో రాజకీయంగా మారిపోయింది. ఆ తర్వాత ఇతర పార్టీల నేతల్ని ఆకర్షించటం ఓ జాతీయ రాజకీయ ప్రాజెక్టుగా మారింది. పార్టీల తలరాతల్ని మార్చగల కొంతమంది బలమైన స్థానిక నేతల్ని ప్రత్యర్థి పార్టీల నుంచి ఆకర్షించటానికి ఉత్తరప్రదేశ్ లోనే (2016 అసెంబ్లీ ఎన్నికలప్పుడు) ఇలా బీజేపీ రూ.2500కోట్లు ఖర్చు పెట్టిందని అంచనా. ఈ డబ్బులు తిరిగి రాబట్టాలంటే రియల్ ఎస్టేట్, బంగారం వ్యాపారాల దందాలో జోక్యం చేసుకోవటం నేతల వ్యూహంలో భాగంగా ఉంటూ వస్తోంది.

డీమానిటైజేషన్ జరిగినా నల్లడబ్బు నాయకుల్లో పలువురు పెద్ద నష్టం లేకుండా తమ సొమ్మును తెలువు చేసేసుకోగలిగారంటే.. ఈ ఓట్ల కొనుగోలు రాజకీయం అడుగడుగునా పాతుకుపోవటమే అందుకు కారణం. ఓటుకు నోటు ఇవ్వకపోతే, ప్రలోభాలు లేకపోతే అసలు ఓటే వేయం అని తీర్మానాలు చేసిన ఊళ్లు, ప్రజానీకం ఉన్న దేశం మనది!

ఓటుకు – తాము కట్టే పన్నుల డబ్బుకు మధ్య సంబంధమై, నోట్లు తీసుకోకుండా తమ నిజమైన ప్రయోజనాలకు ప్రజలు ఓటు వేయాలంటే.. దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలు, అధికారాలను స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయటం వంటి సంస్కరణలతోనే సాధ్యమవుతుంది. ఈసీ పరిధిలో చర్యలు, పన్ను సంస్కరణలు వంటి ఇతరత్రా ఏర్పాట్లు చేపడుతూనే.. ఎన్నికల రాజకీయాన్ని సంస్కరించటం మీద ప్రభుత్వం, రాజకీయ, పౌర, మీడియా వ్యవస్థలు దృష్టి పెడితే చాలామేర నల్లధన రాజకీయానికి మనదేశంలో అడ్డుకట్ట పడుతుంది, సమర్థులు, నిజాయతీపరులు కులం, మతం, ప్రాంతం, డబ్బుతో సంబంధం లేకుండా ఎన్నికల్లో నెగ్గి నిజమైన నాయకత్వాన్ని అందించగలుగుతారు. ❐

# ఓటు డైలమా .. ఇంకొన్ని సంగతులు!



**తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరైనా గెలవొచ్చు. కానీ ఓటు ఎవరికి వేయటం అనే డైలమా, తెలంగాణ ఆకాంక్షల స్థాయిలో కేసీఆర్ ప్రభుత్వం పాలన చేయలేకపోవటం, మీడియా ప్రభావం, ఎన్ని తాయిలాల్ని పందేరం చేసినా ప్రజల్లో పౌర సేవల పట్ల ఉన్న అసంతృప్తి చల్లారకపోవటం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే డబ్బు ప్రభావం ఎక్కువ కావటం, విధానపరమైన డొల్లతనాన్ని బైటపెట్టే అడ్వర్టయిజ్‌మెంట్లు, ఎన్నికల హామీలపై స్టాంప్ పేపర్‌పై రాయించుకోవటం వల్ల ప్రయోజనముంటుందా తదితర అంశాలపై విమర్శనాత్మకంగా సమీక్షించుకోవటం అవసరం.**

**గెలిచినోళ్లని విమర్శిస్తారా? అని కనురుకోవటాలు, హూంకరింపులు లేకుండా.. ఈ విమర్శలను ఘనవిజయం సాధించిన కేసీఆర్ బృందం, పార్టీ కూడా స్వీకరించటం అవసరం. ఎన్నికల్లో గెలవటమంటే.. విమర్శలకు అతీతమని కాదు. అందులోనూ అపరిపక్వ ప్రజాస్వామ్యంలో గెలవటమంటే ఎన్నో లోపాలపై సమీక్షించుకోవాల్సి ఉంటుంది. నిజాయతీగా, వినమ్రంగా ఈ సమీక్ష చేసుకోకపోతే ముస్ముందు ఆయా పార్టీల మనుగడ కూడా ప్రమాదంలో పడుతుంది. దేశ రాజకీయాలలో కూడా గుణాత్మక మార్పు తేవటానికి సారథ్యం వహిస్తానని కేసీఆర్ చెబుతున్నారు. 2.0 పాలనను మెరుగుపరచుకోవటంతోపాటు.. అందుకోసమైనా వీటిని పరిగణలోకి తీసుకోవటం అవసరం.**

ఓటు వేయటానికి గతంలో ఎదురైన డైలమా 2018 తెలంగాణ ముందస్తు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మళ్లీ ఎదురైంది.

'అందరూ ఒకేలా ఉన్నారు, ప్రత్యామ్నాయ విధానాలు లేవు. ఎవరికి ఓటు వేసినా.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టే అవుతుందేమో'.. ఇలా ఓ పెద్ద డైలమాలో చాలా మథనపడాల్సి వచ్చింది.

2008-09 నుంచి ఇప్పటిదాకా లోక్‌సత్తా పోటీలో ఉండటం వల్ల మరో ఆలోచన లేకుండా లోక్‌సత్తాకే ఓటు వేసే వాళ్లం. ఓటు వేశాక వేలి మీద ఇంక్ గుర్తును చూసుకుని.. ఎంతో గర్వంగా ఫీలయ్యేవాళ్లం. ది బెస్ట్ సెల్ఫీ అవకాశం అది! కోట్లాదిమందికి మేలు చేసే కృషిలో నేనూ సరైన దిశలో భాగస్వామినయ్యాననే సంతృప్తి.. ఆ గుర్తును చూసినప్పుడల్లా గుర్తొస్తూ ఎంత అలసటనైనా మాయం చేస్తుండేది. కానీ ఈసారి లోక్‌సత్తా పోటీలో లేదు. ఆరు అంశాల ఎజెండాను ప్రకటించి, వాటిపై అభ్యర్థులను, పార్టీలను అడిగి సంతృప్తికరంగా చెప్పినవారికి ఓటు వేయమని పిలుపునిచ్చింది.

హైదరాబాద్‌లోని మా నియోజకవర్గంలో కొన్ని పార్టీల అభ్యర్థులు మానిఫెస్టోలు పంచారు. వాటిల్లో ఒక్కదాంట్లో కూడా లోక్‌సత్తా చెప్పిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా 'పౌర సేవల' చట్టం, స్థానికంగా అధికారాలు తదితర అంశాలు లేవు. అడుగుదామంటే.. వాటి మీద మాట్లాడటానికి అభ్యర్థులకు తీరిక లేదు. అయితే ఒక ఫోన్ నెంబర్ ఇచ్చారు. మీరు ఏదైనా చెప్పదలచుకుంటే దీనికి మిస్డ్ కాల్ ఇవ్వండని సూచించారు. చేశాం. డబ్బు, మద్యం ఏమైనా కావాలా అని అడిగారు. అవేం అక్కర్లేదు గానీ అంటూ, ఎజెండాను చెప్పాం. అవన్నీ చేసి పెడ్తాం ఓటేయండి అని హామీ ఇచ్చారు. వాళ్లకు ఎజెండాలోని ఆరు అంశాలు పెద్దగా అర్థం కాలేదని మాత్రం మాకు అర్థమైంది.

అభ్యర్థిపరంగా లాభం లేదనుకుని, పార్టీలపరంగా మేనిఫెస్టోల్ని విశ్లేషించాం. ఈసారి మేనిఫెస్టోల మీద కొంత చర్చ జరిగి పోటాపోటీగా చివరిక్షణాల్లో ప్రకటించటంతో అన్నిటినీ తరచి చూశాం. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాకూటమి 'హక్కుగా పౌరసేవల' గురించి ప్రస్తావించింది. ఆరు అంశాల ఎజెండాలోని మిగతా వాటి గురించి ఆ పార్టీలూ స్పష్టతనివ్వలేదు. హక్కుగా పౌర సేవల చట్టం గురించి గతంలో కేసీఆర్ కూడా హామీ ఇచ్చారు. లోక్‌సత్తా ప్రతిపాదించిన ఆ ఒక్క హామీని నెరవేర్చటానికి రెండు ప్రధాన పార్టీలూ కొంత సుముఖంగా ఉన్నట్టు కనిపించాయి. స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, దవాఖానాల మెరుగుదల, చదువు గురించి మొక్కుబడిగా మాట్లాడాయి.

ఈ నేపథ్యంలో.. మళ్లీ టీఆర్ఎస్, ప్రజాకూటమి మధ్య ఎవరిని తేల్చుకోవాలన్న డైలమా వచ్చింది. ఇంక వేరే ఆప్షన్లు ఏమిటా అని వెతికి క్లారిటీ తెచ్చుకోవటానికి కూడా చాలా కష్టపడాల్సి వచ్చింది. విపరీతమైన డబ్బు, సాంకేతికతతో గందరగోళాన్ని సృష్టించిన ఎన్నికలు కావటం, పరిణతి, విశ్వసనీయత గల అభ్యర్థులు కరువవటంతో ఒక పట్టాన స్పష్టత రాలేదు (సరైన అభ్యర్థులుంటే పోలింగ్ శాతం ఇంకొంత

పెరిగేదేమో). ఇంత గజిబిజి ఎన్నికల్ని నేను ఇంతవరకూ చూడలేదు. వెతగ్గా వెతగ్గా లోక్‌సత్తా ఎజెండాతో, భావజాలంతో స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థి కనిపించారు. గుర్తు కూడా లోక్‌సత్తా పార్టీ గుర్తే. 'ఈల'. అదీకాదంటే, 'నోటా' ఉంది.

ప్రజాస్వామ్యమంటే నోటాకు ఓటు వేయటం కాదు కాబట్టి.. చివరికి లోక్‌సత్తా భావజాల స్వతంత్ర అభ్యర్థికే ఓటు వేయటమే మేలన్న భావన వ్యక్తమైంది. టీఆర్ఎస్‌కో, కూటమికో వేసి పౌర సేవల చట్టాన్నయినా సాధించుకుందామన్న వారు అటు వేయండి, అలా నచ్చనివారు ఈలకు వేసేయండి అని ఫైనలైజ్ చేశాం. నేనైతే ఈలకే వేశాను.

అదలా ఉంచితే.. ఇదే సందర్భంలో ఈ ఎన్నికలకు సంబంధించి కొన్ని కీలకమైన పరిశీలనల్ని కూడా పంచుకోవటం అవసరమనిపిస్తోంది..

✦ తెలంగాణ ఉద్యమసారథిగా, తెలంగాణ రాష్ట్రం తేవటంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తిగా కేసీఆర్.. ఆ తరహా ప్రత్యేక ముద్రను తెలంగాణ పాలనలో ఆశించిన మేర చూపలేకపోయారు. అవినీతి నియంత్రణకు కఠిన చర్యలు, గ్రామజ్యోతి వంటి వాటి ద్వారా తొలుత కొంత ప్రయత్నించినా.. ఆ తర్వాత పాతరాజకీయ నాయకత్వ ధోరణిలోకి జారిపోయారు. తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని ప్రతిబింబించే ప్రత్యేకతేగనక ఆయన పాలనలో ఉన్నట్టయితే.. అంతమంది ఎమ్మెల్యేలపై అంత వ్యతిరేకత వచ్చేదికాదు, తనకున్న జనాదరణను ఏమాత్రం చెమట చిందకుండానే ఓట్లు, సీట్ల రూపంలోకి మార్చుకునేవారు, ప్రజాకూటమి పేరుతో చంద్రబాబు, కాంగ్రెస్ కలిసి చేసిన ప్రచారానికి కూడా అంత జనాదరణ లభించేది కాదు. వ్యూహాత్మక ఓటింగ్ వల్ల గెలవకపోవచ్చు కానీ.. అసలు సోదిలో లేరు అనుకునే స్థాయి నుంచి గట్టి పోటీ ఇచ్చే స్థాయికి కూటమి చేరుకుంది. ప్రజాకూటమికి అనుకూలంగా ప్రచారమాధ్యమాలు మితిమీరి ప్రచారం చేశాయనుకున్నా.. కేసీఆర్ పాలన సరైన భిన్నత్వంతో ప్రజల్లో ముద్ర వేయలేకపోవటం, దానికితోడు ఆయన ఏకపక్ష ధోరణులు కూటమికి అనుకూలతలుగా మారాయి.

✦ ఉద్యమ సమయంలో ప్రజలు నీళ్లు, నిధులు, నియామకాలు వంటి కొన్ని అంశాలను నినాదంగా చేసుకొని ఉండొచ్చు. కానీ వారి ఆకాంక్షలు ఆ నినాదం కంటే కూడా గాఢమైనవి. తమ మనసులో ఏమనుకుంటున్నామో ప్రజలు కూడా అప్పట్లో గుర్తించి ఉండకపోవచ్చు. కానీ ఆ గాఢతను గుర్తించి తెలంగాణలో ఒక గుణాత్మక మార్పును తేకుండా.. వైఎస్ రాజశేఖర రెడ్డి తరహా ఫార్ములాలోనే కేసీఆర్ పాలన సాగించారు. హైదరాబాద్‌లో సామరస్య వాతావరణాన్ని నెలకొల్పటం ప్రధానంగా కేసీఆర్ ఘనతే! అలాగే జనరంజకమైన పథకాలతో కేసీఆర్ భారతదేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన ముఖ్యమంత్రి కాగలిగారు. వీటిలో కొన్ని అవసరమైనవి కూడా ఉన్నాయి. కానీ.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చే స్థాయి పాలన చేయలేకపోయారని ప్రజల్లో ఆయన పట్ల అంతర్గతంగా ఉన్న (అండర్ కరెంట్) అసంతృప్తి ప్రచార సమయంలో స్పష్టంగా కనిపించింది. ఉదాహరణకు తెలంగాణ ఎదుగుదలకు కీలకమైన విద్యారంగంలో రాష్ట్రం దేశంలోనే అట్టడుగు నుంచి రెండోస్థానంలో ఉంది, విద్యాప్రమాణాల్లో అధ్వాన్నంగా ఉంది. కేవలం స్కీములు, పథకాలు, ఉచితాల కోసమే అయితే అందుకు ప్రత్యేక తెలంగాణ, టీఆర్ఎస్ అక్కర్లేదు. పెర్‌సెప్షన్ యుద్ధంలో కేసీఆర్ గ్రాఫ్ ఉన్నట్టుండి కుదుపులకు గురవటానికి ఇది ప్రధాన కారణం. కేసీఆర్‌ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా పోరాటం సాగించిన కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాకూటమి కూడా ఉద్యమస్ఫూర్తికి అద్దం పట్టేలా ప్రత్యామ్నాయ ఎజెండాను ప్రతిపాదించ లేకపోయింది. అన్ని జనాకర్షక పథకాల్ని తెచ్చినా కేసీఆర్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఎందుకు వ్యతిరేకత ఏర్పడింది? అని ఆలోచించి ప్రత్యామ్నాయం రూపొందించకుండా, తెలంగాణ ఏర్పాటు లక్ష్యాల్ని నెరవేర్చే ప్రయత్నం చేయకుండా ప్రజల్ని యాచకుల్లా లెక్కేసి మేనిఫెస్టోని ప్రకటించారు. దీంతో.. ఎవరు గెలిచినా పెద్ద తేడా ఏమీ ఉండదనే ఒక రకమైన యాంత్రిక వాతావరణం మధ్యే ప్రజలు వ్యూహాత్మకంగా ఓటేశారు. ఒక పెద్ద మార్పు తేగలమనే ఉద్వేగమేదీ ఈ ఎన్నికల్లో కన్పించలేదు. 1977లో ఇందిరాగాంధీని గద్దె దించాలనుకున్న స్థాయిలో కేసీఆర్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత లేకపోవటం, ఎంఐఎం మద్దతు, బలమైన ప్రత్యామ్నాయ కార్యాచరణతో, ఉన్న తక్కువ సమయంలో ప్రతి నిమిషాన్నీ సద్వినియోగం చేసుకుంటూ పకడ్బందీ వ్యూహరచనతో కూటమి తలపడకపోవటం, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవటం, కొన్ని సభల్లో చంద్రబాబు తదితరుల ప్రచార సరళి సెల్ఫ్‌గోల్‌లా ఉండటంతో.. గెలుపు కేసీఆర్‌దే అయింది.

✦ "ఇటీవల అవినీతి+ సంక్షేమం= అధికారం అనే ఫార్ములాను కనిపెట్టి సంక్షేమం పేరుతో పప్పుబెల్లాల్లాంటి పథకాలను పంచుతున్నారు. ఆ తాత్కాలిక సెంటిమెంట్లను, తాత్కాలిక సూత్రాలను ప్రజలు తిప్పికొట్టే రోజు త్వరలోనే వస్తుంది. ప్రజలు మార్పు ప్రక్రియలో త్వరితగతిన పాలుపంచుకునేందుకు వీలుగా అవినీతిపరుల పీచమణిచే బలమైన చట్టాలతోపాటు ఎన్నికల వ్యవస్థలో కూడా మార్పులు రావాలి" అని 2012, డిసెంబర్ 6న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద లోక్‌సత్తా జేపీ చేసిన మూడు రోజుల సురాజ్య ఉద్యమ నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపే సందర్భంలో కేసీఆర్ కుమారుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. కానీ గత నాలుగున్న రేళ్లుగా తెలంగాణ పాలనలో ఈ మాటల్ని ఏ మేరకు అమలు చేయగలిగారు, ఆ దిశగా ఏం ప్రయత్నం చేశారు అంటే.. సమాధానం నిరాశ పరుస్తుంది.

✦ ఒకప్పుడు హైదరాబాద్‌లోనే అతిఎక్కువ సిటీ బస్సులు తిరిగే 45 నెంబర్ రూట్‌లో ఈవేళ బస్సులు ఎంతో అధ్వాన్నంగా తయారయ్యాయి. ఉపాధి కోసం రోజూ ఆ రూట్ బస్సులో వెళ్లే

ఓ మహిళ ఎన్నికల ప్రచారం సమయంలో కామెంట్ చేస్తూ.. కేసీఆర్ కన్నా చంద్రబాబు హయాంలోనే బస్సులు, రోడ్లు చక్కగా ఉండేవి, టైంకి వచ్చేవి అని నిక్కచ్చిగా నిరసన వ్యక్తం చేశారు. ఆమె పక్కా తెలంగాణవాది, గత ఎన్నికల్లో కేసీఆర్‌కే ఓటు వేశారు. కేసీఆర్ ప్రభుత్వం నుంచి అనేక ఉచితాల్ని, తాయిలాల్ని అందుకుంటున్నా కూడా.. ఆమె అంత వ్యతిరేకతతో స్పందించారు. తాయిలాలు, ఉచితాల్ని ఎన్ని ఇచ్చినా, ఎమ్మెల్యే అభ్యర్థులు, కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాల్లో పైరవీలు చేసి పనులు చేసి పెడుతున్నా, కులాలు, ప్రాంతీయ భావనల్ని ఎంత రెచ్చగొట్టినా.. ప్రజలకు వారి రోజువారీ జీవితంలో సేవల్ని సక్రమంగా అందించకపోతే తీవ్ర వ్యతిరేకత తప్పని పరిస్థితే నెలకొంటుందని, ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా తాయిలాలతో కాలక్షేపం చేయటం ఎల్లకాలం సాధ్యం కాదని లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చేస్తున్న హెచ్చరికలకు ఇదో రుజువు. తెలంగాణ వస్తే తమ బతుకులు బాగుపడతాయన్న ఆశతో రాష్ట్రాన్ని ప్రజలు కోరుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు మార్గమే తప్ప లక్ష్యం కాదు! ఈ వాస్తవాన్ని గుర్తించకుండా సెంటిమెంట్ చుట్టూ ప్రజల్ని ఎల్లవేళలా మత్తులో ముంచాలనుకోవటం దుస్సాహసమే అవుతుంది. కేసీఆర్ మీద కోపంతో ఆమె చంద్రబాబును ప్రశంసించారుగానీ, టెక్నాలజీ వినియోగం మినహా ప్రభుత్వ సేవలను బాబు కూడా ఏమీ మెరుగుపరచలేదు. ఏపీలో పరిస్థితే ఇందుకు తాజా ప్రత్యక్ష ఉదాహరణ. హైదరాబాద్‌లో ఆర్టీసీపై మౌలికవసతులకు పెట్టుబడి పెట్టి బాగు చేసింది ఎన్.టి రామారావు ప్రభుత్వం! దాన్ని కనీస స్థాయిలో కూడా కొనసాగించలేకపోవటం వల్ల ఈవేళ కేసీఆర్ కంటే చంద్రబాబు మెరుగ్గా కనబడుతున్నారు. ప్రజలకు నాణ్యమైన పౌర సేవల్ని హక్కుగా అందించకపోతే ప్రజల సొమ్ముతో పందేరాలు ఎల్లకాలం తమను కాపాడలేవని అన్ని పార్టీలకూ ఈ ఎన్నికలు పాఠం చెబుతున్నాయి.

✦ ఈ ఎన్నికల్లో నేర చరిత్ర ఉన్న అనేకులు పోటీ చేసినట్టు నిగ్గుతేలింది. కానీ 'నేర రాజకీయాలు జబ్బు లక్షణమే తప్ప.. అసలు జబ్బు కాదు. ఎన్నికల తీరుతెన్నుల్ని సమూలంగా మార్చే సంస్కరణల్ని తీసుకురాకుండా కేవలం నేర రాజకీయాల మీదే దృష్టి సారించటం వల్ల ప్రయోజనం ఉండదని' లోక్‌సత్తా జేపీ పలుమార్లు చెప్పిన మాటల్ని ఈ ఎన్నికలు కూడా రుజువు చేశాయి.

✦ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే దిగ్భ్రాంతికరమైనరీతిలో ఈసారి తెలంగాణలో డబ్బు చుట్టూ ఎన్నికలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఉండదని కేసీఆర్ స్వయంగా ఉద్యమ సమయంలో అన్నారు. డబ్బు ప్రభావం ఒక ఎత్తయితే, డబ్బు ఎన్నికల్లో టీఆర్ఎస్ కూడా ప్రధాన భాగస్వామి కావటం పెద్ద విషాదం. కొంత ఎక్కువ, తక్కువ తేడాలుండొచ్చుగానీ.. ప్రత్యర్థి పార్టీలాగే టీఆర్ఎస్ మీటింగులకు వెళ్లిన దాదాపు ప్రతి ఒక్కరికీ డబ్బు పంచారన్నది పచ్చి వాస్తవం. అసలు ఉద్యమ పార్టీ టీఆర్ఎస్‌కు అంత డబ్బు ఎలా వచ్చింది అనేది అడిగి తీరాల్సిన ప్రశ్న. టీఆర్ఎస్ ఏదోకరూపంలో ప్రజాధనాన్ని కొల్లగొట్టకపోతే అంత డబ్బు సమకూరే అవకాశముంటుందా?

✦ ఎన్నికైన దాకాకూడా ఆగకుండానే ఎన్నికల ముందే పార్టీ ఫిరాయించి అభ్యర్థి కాడి పారేసేందుకు వీలుగా కొన్ని నియోజకవర్గాలలో ప్రధాన అభ్యర్థులకు పదుల కోట్ల రూపాయలు పంచినట్లు వార్తలు వచ్చాయి. ఫిరాయింపుల షాక్‌లో ఉన్న ప్రజాస్వామానికి 'ప్రీపోల్ ఫిరాయింపులు' ఈ ఎన్నికల్లో మరింత షాక్‌నిచ్చాయి.

✦ తెలంగాణ రావటం మంచిదా, కాదా అన్న చర్చ ఇప్పుడు అనవసరం. రాష్ట్రం ఏర్పాటు మౌలికమైన అంశమేమీ కాదు. వచ్చిన తెలంగాణను జనతెలంగాణగా ఎలా అభివృద్ధి చేసుకోవాలి అన్నదే ఇప్పుడు లక్ష్యం. రెండు రాష్ట్రాలయ్యాక కొంత పోటీ పెరిగింది, ఆర్థిక వనరులు కూడా పెరిగాయి. కేసీఆర్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ తప్పులు చేస్తున్నా.. కొందరు సామాజిక నేతలు ఎందుకు బహిరంగంగా గట్టిగా మాట్లాడలేదంటే– కొత్త రాష్ట్రాన్ని కుదురుకోనీయకుండా కుదుపులకు గురిచేయకూడదనే ఉద్దేశంతో! కానీ దాన్ని కేసీఆర్ సానుకూలంగా అర్థం చేసుకున్నట్టు కనిపించదు. హేతుబద్ధ పౌర ఉద్యమకారులు తమ భావాల్ని వ్యక్తం చేయటానికి అపాయింట్‌మెంట్ ఇవ్వటానికి కూడా ఆయనఆసక్తి చూపలేదు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబుతో కూడిన ప్రజాకూటమి అధికారంలోకి వస్తే, కొత్త రాష్ట్రం అస్తిత్వం ఏమైనా దెబ్బతింటుందా అన్న సందేహం పలువురిలో కనిపించింది. కేసీఆర్‌ను ఆమోదించలేక, ప్రజాకూటమికి ఓటు వేయలేక వాళ్లు సందిగ్ధానికి గురయ్యారు. పెనం మీద పొయ్యిలోకి అన్న చందంగా వారి పరిస్థితి తయారైంది.

✦ కేవలం మీడియానే ఎన్నికల్లో నేతలను గెలిపించలేదుగానీ, మీడియా ప్రభావం గణనీయమైనదనటంలో సందేహం లేదు. ఈ ఎన్నికల్లో ప్రధాన మీడియా అప్పటివరకూ ఇచ్చినట్టు తనకు గంపగుత్త మద్దతివ్వకుండా వ్యతిరేక కథనాలను కూడా విస్తృతంగా ప్రచారం చేయటంతో కేసీఆర్ డిఫెన్స్‌లో పడ్డారు. మీడియా గనక గత నాలుగున్నరేళ్లుగా సక్రమంగా తన బాధ్యతల్ని నెరవేర్చి ఉంటే.. కేసీఆర్, చంద్రబాబు, నరేంద్ర మోదీలకి ఇంత ఆదరణ ఉండేదా? అన్న సందేహం కూడా కలుగకమానదు.

✦ కాంగ్రెస్, తెలుగుదేశం పాలూ, నీళ్లలా కలిసిపోయాయని తెదేపా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ప్రచారంలో అన్నారు. నిజమే.. తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో కూడా అన్ని పార్టీలూ ఒకేతాను గుడ్డల్లా మారి ప్రజల్ని

యాచకుల్లా మార్చే తాయిలాల్నే విధానాలుగా భ్రమింపచేస్తూ అమలు చేస్తున్నాయి. ఏ నాయకుడు, నాయకురాలు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పలేనంత దౌర్భాగ్య పరిస్థితి. ప్రత్యామ్నాయాన్ని నాయకత్వాన్ని అందించలేనికాడికి.. ఇన్ని పార్టీలెందుకు? ప్రధాన జాతీయ పార్టీలుగా ఉన్న కాంగ్రెస్‌కు, బీజేపీకి మధ్య ఉన్న తేడా కూడా క్రమంగా చెరిగిపోతుండటం దురదృష్టకరం. పార్టీల్ని ప్రజాస్వామీకరించి.. సమర్థత ఉంటే సామాన్యుల్ని సైతం ఉన్నత స్థానాల్లో కూర్చునే అవకాశాల్ని ఎప్పుడు కల్పించేలా చేయటం ఓ కీలకాంశంగా ఈ ఎన్నికల్లో ముందుకొచ్చింది.

✦ ప్రజాకూటమికి మద్దతిచ్చిన ఓ ప్రముఖ సామాజిక కళా ఉద్యమకారుడు ఎన్నికలకు ముందు లోక్‌సత్తా జేపీని కలిసి ఓ ప్రతిపాదన గురించి అడిగారు. ఉద్యమకారులంతా కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే ఎలా ఉంటుందన్నారు. అందరినీ కలిపే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. అయితే పరిస్థితి అందుకు అనుకూలంగా లేదని జేపీ చెప్పారు. దానికన్నా కూడా.. 'ఉద్యమకారునిగా మీకున్న ఆదరణను ఉపయోగించి ప్రజలను కొన్ని మౌలిక అంశాలతో కూడిన ఎజెండాపై చైతన్యం చేస్తే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందని' సూచించారు. విపరీతమైన డబ్బు చుట్టూ ఎన్నికలు, స్థానిక ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం వల్ల యువత నేరుగా రాజకీయ పార్టీల్లో నాయకులుగా ఎదగటం కష్టమని, అలా వస్తే క్రష్ అయిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. 'కానీ యువత సంఘటితంగా తమ పరిధిలో పనిచేయటం మొదలుపెడితే ఈ పరిస్థితి మారుతుంది కాబట్టి.. మీ పరపతితో, కళతో వారిని ఆ దిశగా కదిలించండి' అని జేపీ సలహా ఇచ్చారు. ఆ ఉద్యమకారుడుగానీ, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాంగానీ కేవలం ఎజెండాకు పరిమితమై ఎన్నికల్లో ఒక్క సీటుకు కూడా పోటీచేయకుండా ఉంటే గట్టి ప్రభావం చూపగలిగి ఉండేవారు. చంద్రబాబు, రాహుల్ గాంధీతో వారు కలిసిన తీరు, అందుకు ప్రాతిపదికగా వారు చెబుతున్న ఉమ్మడి ఎజెండా ఆశాజనకంగా లేవు.

✦ ఈసారి ప్రచారంలో సోషల్ మీడియా, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్ని వినియోగించినా, ప్రచారతీరు, అందులోని అంశాలు, వాదప్రతివాదాలు పాతవాసనలే కొట్టాయి. ఎవరు గెలిచినా, ఓడినా అగ్రనాయకుల ప్రచారంలో కూడా మూస పద్ధతులే ఎక్కువగా కనిపించాయి. సరైన విషయం లేక దూషణలు మితిమీరాయి. చంద్రబాబు నాయుడు ప్రజాప్రయోజనాలకు తగ్గట్టు కాకుండా.. తన స్వీయ మానసిక అవసరం కోసమనట్టు అడ్మినిస్ట్రేటివ్ చర్యల్ని మౌలిక మార్పుల్లా డబ్బా కొట్టుకోవటం (పెద్దగా ఓటు వేయని వర్గాలు ఈ డైలాగులకు చప్పట్లు కొట్టాయి) ఎబ్బెట్టుగా అనిపించింది. కొంతమేర కేసీఆర్‌లో కూడా ఈ పోకడలు కనిపించాయి. నేతలు ఎంత రెచ్చగొట్టినా.. పలుచోట్ల ప్రజలు ఆంధ్ర-తెలంగాణ భావన లేకుండా ఓట్లు వేయటం మంచి పరిణామం.

✦ టీవీల్లో ఒక ప్రధాన పార్టీ తన మేనిఫెస్టోపై ఓ యాడ్‌ను విడుదల చేసింది. అది వైద్య ఆరోగ్యానికి సంబంధించినది. అందులో ఒక ముదుసలి వ్యవసాయ కూలీ తన భార్యకు మందులు కొనుక్కుంటుంటాడు. 'మరి నీ భార్యకు మందులు తీసుకెళ్లవా పెద్దాయనా?' అంటాడు మెడికల్ షాపతను. 'నా మందులకు డబ్బుల్లేవు, పింఛను సరిపోదంటూ' ఆ పెద్దాయన వెళ్లిపోతాడు. ఆ తర్వాత పెద్దక్షరాలతో ఆ పార్టీ యాడ్ వస్తుంది. 'మా పార్టీ అధికారంలోకి వస్తే పింఛనుకు వయసు తగ్గించటంతోపాటు రెట్టింపు ఇస్తామని'! పింఛను పేరుతో ప్రజల్ని ఆకర్షిద్దామని తప్ప, అందరికీ సరైన ఆరోగ్యాన్ని ఉచితంగా అందిస్తే ఇలా వృద్ధులు, పేదలు, మధ్యతరగతివాళ్లు పింఛను పెంపు కోసం చేయి జాచాల్సిన పరిస్థితి ఉండదన్న కనీస ఆలోచన ఆ పార్టీలో కరువైంది. మరోపక్క అదే పార్టీ ఆరోగ్యశ్రీ పేరుతో కోట్లాది పేదప్రజలకు ఆరోగ్యాన్ని అందించే గొప్ప పథకాన్ని ప్రారంభించామని డబ్బా కొట్టుకుంటోంది. 'ఆరోగ్యం కోసం పింఛను పెంపు' అనే ఐడియా ప్రజారోగ్యం విషయంలో ఆ పార్టీ కపటత్వాన్ని, భావదారిద్ర్యాన్ని పట్టిచ్చింది. నిజంగా ప్రజలకు ఆరోగ్యం అందించే ఉద్దేశం, దానికి సంబంధించిన అవగాహన ఆ పార్టీకి లేదని చెప్పకనే చెప్పే అడ్వర్టయిజ్‌మెంట్ అది. ఆ పార్టీకి ప్రత్యర్థిగా ఉన్న పార్టీ తీరు కూడా అదే. ఆరోగ్యానికి, చదువుకు డబ్బులివ్వకూడదు.. తాయిలాలకైతే అప్పు తెచ్చి మరీ ఇచ్చేయొచ్చు. ఎందుకంటే.. ప్రజలు శారీరకంగా బలంగా ఉండకూడదు, ఆలోచించకూడదు, ఎప్పుడూ పార్టీల ముందు యాచకుల్లా ఉంటూ వారికి ఓట్లేసే యంత్రాల్లా పడుండాలి! తెలంగాణలో అంత గొప్ప ప్రజాస్వామిక ఉద్యమం జరిగాక కూడా తాజా ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఇలా పాత రాజకీయ సంస్కృతితోనే పోటీ పడ్డాయి.

✦ కేసీఆర్ కుమారుడు కేటీఆర్, కుమార్తె కవిత తమపై విమర్శలకు ఇచ్చిన సమాధానాలు తెలంగాణ ఉద్యమస్ఫూర్తికి ఏమాత్రం తగినట్టు లేవు. ఎటువంటి ఆత్మపరిశీలన లేకుండా.. కుటుంబ పాలన ఏ పార్టీలో లేదు? అంటూ వారు ఎదురుదాడికి దిగారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు తెలంగాణకు గుదిబండ అని లోక్‌సత్తా చేసిన పోరాటానికి మద్దతిచ్చిన కేసీఆర్.. ఆ తర్వాత దాన్నే అటూఇటూ చేసి కాళేశ్వరంగా మార్చి భారీగా నిధుల్ని వ్యయం చేయటంపై చేసిన విమర్శలకు కేటీఆర్ సమాధానమివ్వాలనుకోలేదు. ఆ ప్రాజెక్టుపై పారదర్శకంగా చర్చించకపోయినా తమను అడిగేవాళ్లెవరు అన్నట్టుగా వ్యవహరించారు.

✦ 'తెలంగాణ ఉద్యమంలో కీలక నేతగా, తొలి ముఖ్యమంత్రిగా మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటారు' అని టీఆర్ఎస్

పార్టీ నుంచి రాజీనామా సమయంలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వరరెడ్డి కేసీఆర్‌కు రాసిన లేఖలో అన్నారు. కేసీఆర్‌ను గొప్ప పరిపాలనాదక్షుడిగా ప్రజలు గుర్తుపెట్టుకోరు.. అని ఆయన చెప్పకనే చెప్పిన విషయాన్ని తీసిపారేయలేం.

✦ తెలంగాణలో మోదీ, అమిత్‌షా, సోనియా, రాహుల్ వంటి వారు ప్రచారం చేయంగా లేంది చంద్రబాబు చేస్తే తప్పేంటి అన్న సింపుల్ లాజిక్‌ను కేసీఆర్ ప్రదర్శించి విధానపరంగా పోరాడలేకపోవటం తన పాలనా వైఫల్యాన్ని అంగీకరించటమే అవుతుంది.

✦ ఎన్నికల్లో ఓడిపోతే ఇంటికి పోయి హాయిగా పండుకుంటానని కేసీఆర్, రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ చెప్పిన మాటలు వారి వ్యతిరేకులకు కూడా నిరుత్సాహానికి గురిచేశాయి. ఒక ఉద్యమం చేసినవాళ్లు, తెలంగాణ ప్రజలకు మేలు చేయాలనుకున్నవాళ్లు ఇలాంటి మాటలు అనగలరా? అన్న భావన కలిగించాయి.

✦ లోక్‌సత్తా పార్టీ సెప్టెంబర్ 09, 2008న 'గ్రామంలో ఒకరోజు' పేరుతో స్థానిక మేనిఫెస్టోల రూపకల్పన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఒక గ్రామంలో అమలు చేయాల్సిన పనుల్ని పైనుంచి రుద్దకుండా ఆ గ్రామంలోనే మేనిఫెస్టోగా తయారుచేసే ప్రయత్నం ఇది. గ్రామస్తులను ఒకచోట చేర్చి వారి నుంచి సమస్యల్ని, అభిప్రాయాల్ని, సూచనల్ని తీసుకుని కొన్ని మేనిఫెస్టోల్ని తయారు చేశారు. అలాగే 2009, 2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 'వార్డు స్థాయి మేనిఫెస్టోల్ని' తయారు చేశారు (తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమలోని ప్రతి పట్టణం/నగరంలో వార్డులవారీగా సమస్యలను క్రోడీకరించి.. పరిష్కారాలు, వాటికయ్యే నిర్ణీత కాలవ్యవధితో ఓ బోర్డు రూపంలో తయారుచేసి ఆ పట్టణం/నగరం ప్రవేశ మార్గాల వద్ద ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని కూడా తీసుకోవాలని 2009లో జేపీ సూచించినా, అదో రాజకీయ కార్యక్రమం కాదని లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేతలు కొందరు సుముఖత వ్యక్తం చేయలేదు. దాంతో ఆ కార్యక్రమాన్ని పక్కనపెట్టారు. హైదరాబాద్‌లో కొంతమంది నేతలు తమ కాలనీల్లో ఈరకంగా బోర్డులు పెట్టుకున్నారు. తెలంగాణ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓ గ్రామం వారు ఇలా బోర్డు పెట్టి పార్టీలను వాటి కోసం అడిగినట్టు వార్తలు చదివి చాలా సంతోషం కలిగింది. ఈ తరహా ప్రయత్నాలు విస్తరించాలి). వీటి అమలుకు ప్రధాన అవరోధం.. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు లేకపోవటం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పనులు జరగకపోవటం అని స్పష్టమైంది. అందుకే స్థానిక సమస్యలను, అవసరాలను ఉమ్మడిగా పరిష్కరించుకోవటంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తూనే, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధుల బదిలీ కోసం లోక్‌సత్తా గట్టిగా కృషి చేస్తోంది. తాజా తెలంగాణ ఎన్నికల్లో కూడా 'స్థానిక ప్రభుత్వాల సాధికారత'ను ఓ ప్రధాన ఎజెండా అంశంగా లోక్‌సత్తా ప్రతిపాదించింది. ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల అభ్యర్థుల నుంచి హామీలపై స్టాంప్ పేపర్‌పై సంతకాలు తీసుకున్నట్టు వార్తలచ్చాయి. ఇందులో తప్పేం లేదుగానీ, అసలు ఆ హామీల్ని నెరవేర్చాల్సింది ఎమ్మెల్యేనా, స్థానిక ప్రభుత్వ ప్రతినిధా? అన్న స్పష్టత లేకుండానే ఈ ప్రక్రియ కొనసాగింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా పలుచోట్ల ప్రజలు చేసిన డిమాండ్లు చాలావరకు స్థానిక ప్రభుత్వాలు చేయాల్సిన పనులు! స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు దాటినా.. రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే, స్థానిక ప్రభుత్వం చేయాల్సిన పనులేమిటో కూడా ప్రజలకు ఇంకా తెలియనీయని రాజకీయం చేస్తున్నామని ఈ ఎన్నికలు మరోమారు రుజువు చేశాయి. ఆ విషయాన్ని అలా వుంచినా, ఇచ్చిన హామీల్లో అనేకం అనవసరమైన ఉచితాలు, తాయిలాలు, ప్రలోభాలు. అసలు హామీలే సరైనవి కానప్పుడు, వాటి అమలు గురించి స్టాంప్ పేపర్‌పై గ్యారంటీ సంతకం తీసుకోవటం వల్ల ఫలితమేంటి? నిర్దిష్ట సమయంలోగా చేయలేకపోవచ్చుగానీ.. ఉచితాలకు సంబంధించిన హామీల్ని పాలకులు చాలామేరకు అమలు చేస్తున్నారు. కానీ వీటి వల్ల ప్రజలు నిరంతరం పేదరికంలో కొనసాగుతూ యాచకులుగానే మిగిలిపోవాల్సి వస్తోంది. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం ఎన్.టి రామారావు ప్రభుత్వం ఇచ్చిన రూ.2 కిలో బియ్యం పథకాన్ని ఇప్పుడు ఇంకా తక్కువ రేటుకి (మార్కెట్లో అప్పటి కంటే బియ్యం ధర పది రెట్లు పెరిగినా) అమలు చేయటం ఇందుకు చిన్న ఉదాహరణ. ప్రభుత్వం అసలు తాను చేయాల్సిన పనులు చేయకుండా ఉచితాలు, ప్రలోభాలతో కాలక్షేపం చేయటం, ఆ హామీల మీద మనం పట్టుబట్టటం వల్ల మన జీవితాలు ఎప్పటికీ బాగుపడవు. ప్రభుత్వం చేయాల్సిన పనులను పాలకులు చేస్తే, ఉచితాల్ని ఎరగా వేసి ప్రజలను ఆకట్టుకోవాల్సిన అగత్యం కూడా ఉండదు. ఉచితాలపై పట్టుబట్టటం కన్నా.. ప్రభుత్వాల్ని, పార్టీల్ని ఏమడగాలి, వాటి అమలులో ఏరకంగా భాగస్వాములు కావాలి అనే దిశగా ప్రజల్లో చర్చను పెంచటం మేలు.

✦ ఓటరు జాబితాల నిర్వహణలో, డబ్బు పంపిణీ వంటి అక్రమాలపై చర్యలు తీసుకోవటంలో తెలంగాణలో ఎన్నికల సంఘం విఫలమైనట్టు స్పష్టంగా కనిపించింది. ఓట్ల గల్లంతుతో పాటు కొన్నిచోట్ల దొంగ ఓట్లు, సైక్లింగ్ ఓట్లు పెద్దఎత్తునే పడ్డట్టు మీడియాలో ఫోటోలతో సహా వార్తలచ్చాయి. లక్షల ఓట్లు గల్లంతైనందుకు ఎన్నికల ముఖ్య అధికారి క్షమాపణ చెప్పటంతో జరిగిన నష్టం పోదు. ఆరు నెలల్లోగా ఎప్పుడైనా ఎన్నికలు జరిపే అవకాశమున్నప్పుడు.. ఓటరు జాబితాలు సిద్ధం కాకుండా అంత హడావుడిగా ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరమేముంది? లోక్‌సత్తా 1999 నుంచి కొన్ని సంవత్సరాల పాటు చేసిన కృషి వల్ల పట్టణ ప్రాంతాల్లో తప్పులు 44.8 శాతం నుంచి 15.9 శాతానికి, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం నుంచి 5 శాతానికి తగ్గాయి. కానీ పలు పట్టణ ప్రాంతాల్లో అవకతవకలు మళ్లీ 20 శాతానికి చేరాయి. 5 నుంచి 8 శాతం మంది దాకా పేర్లు నమోదు

కాలేదు. ఎన్నికల సమయంలోనే మేలుకొంటే చక్కదిద్దగలిగే పరిస్థితి కాదిది. ఓటరు జాబితాల్లో సవరణల్ని నిరంతర ప్రక్రియగా చేయటమే ఆచరణాత్మక పరిష్కారం. ఇందుకోసం 'పోస్టాఫీసుల్ని ఓటరు నమోదుకు శాశ్వత నోడల్ ఏజెన్సీ'గా చేయటం వంటి పరిష్కారాల్ని అమలు చేయాలి. లోక్‌సత్తా చేసిన ఈ ప్రతిపాదనకు రాజకీయంగా అవరోధం లేకపోయినా.. ఎన్నికల సంఘం మాత్రం తగిన రీతిలో స్పందించటం లేదు. సాంకేతికంగా మెరుగైన ఫలితాల్ని సాధిస్తున్న ఈసీ.. ఓటరు జాబితాల నిర్వహణలో కూడా సమర్థవంతంగా వ్యవహరించాలి.

✦ ఎన్నికల సమయంలో, ప్రధాని, రాష్ట్రపతి వంటి వారి పర్యటనల్లో, ప్రకృతి విపత్తులు, పుష్కరాలు వంటి ఈవెంట్లలో మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుందని, అదే అధికారులు, ఉద్యోగులతో సాధారణ పాలనలో కూడా సరిగా పనిచేయించే ఏర్పాట్లు పాలకులు చేయలేకపోతున్నారని లోక్‌సత్తా చాలాకాలంగా వాదిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల చట్టాన్ని అందుకు పరిష్కారాల్లో భాగంగానే ప్రతిపాదిస్తోంది. లోక్‌సత్తా వాదనకు ఈ ఎన్నికల్లో కొన్ని ఉదాహరణలు లభించాయి. ఓటర్ల జాబితాల నిర్వహణలో తప్పిదాలు చేసిన అధికారులపై పెద్ద చర్యలు తీసుకోలేదుగానీ, కొన్నిచోట్ల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు తప్పు చేసిన ఉద్యోగులపై ఏమాత్రం ఆలస్యం లేకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. కరీంనగర్‌లో ఏకంగా 170 మందిపై వేటు వేసినట్లు వార్తలు వచ్చాయి. ఇదే తరహాలో అన్ని సందర్భాల్లో వ్యవహరిస్తే, ప్రభుత్వోద్యోగులు మన మీద పెత్తనం చేసేవారుగా కాకుండా మనకు సేవకులుగా వ్యహరిస్తూ మెరుగైన సేవలను అందించగలుగుతారు.

✦ ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థి గెలిచినట్టే.. ఇక మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే మన ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ (ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్ సిస్టమ్- ఎఫ్‌పీటీపీ) వల్ల ఎన్నికలు ఎంత వికృతంగా తయారయ్యాయో, అదనపు ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు ఎంత బరితెగిస్తాయో ఈ ఎన్నికలు మరోసారి సాక్షాత్కరింప చేశాయి. ఓటు వృథా కాకుండా ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రి ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణల్ని తీసుకురావటం అవసరం.

✦ మద్యం అలవాటు ఎక్కువ కావటానికి ఎన్నికల సమయంలో లిక్కర్ పంచటమే కారణమని లోక్‌సత్తా 2007లో బెల్టు షాపులపై ఉధృతంగా పోరాటం చేసిన సమయంలో గట్టిగా వాదించింది. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకూడదనే విధానానికి కట్టుబడి వ్యవహరించింది. యువతలో మద్యం అలవాటును పెంచేలా తెలంగాణలో తాజా ఎన్నికల్లో లిక్కర్ ప్రవహించింది.

✦ తెలంగాణతో పాటు ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్‌లో రైతులు ఈసారి కులం ప్రాతిపదికన కాకుండా వ్యవసాయ వృత్తి ప్రాతిపదికన ఏకమయ్యారనే విశ్లేషణలు వచ్చాయి. 'మేం వెనుకబడిన, అణగారిన కులాల్లో పుట్టటం వల్ల కన్నా కూడా రైతులు, కౌలురైతులు కావటం వల్ల ఎక్కువ నష్టపోతున్నామని' వారు గుర్తించినట్టు చెబుతున్నారు. 2010 నుంచి లోక్‌సత్తా చేసిన రైతు ఐక్యతా ఉద్యమంలో జేపీ ఇదే మాట చెప్పారు. కులం, పార్టీ, ప్రాంతం, పంటలను పక్కనబెట్టి రైతులంతా ఏకమై వ్యవసాయాన్ని లాభసాటి చేసుకునేందుకు ఉద్యమించాలని జేపీ పలు సమావేశాలు, కార్యక్రమాల ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చుట్టుపక్కల రాష్ట్రాల రైతులకు విజ్ఞప్తి చేశారు. 1970వ దశకంలో రైతులు సోషలిస్టు భావజాలుర ప్రభావంతో వర్గ ప్రాతిపదికన ఏకమైన రీతికి భిన్నంగా ఈసారి ఏకమయ్యారని విశ్లేషకులు అంటున్నారు. ఈ చైతన్యం తెలుగు రాష్ట్రాలకు కూడా రావాలి. అయితే రైతులు ఏకమై పోరాడుతున్నా వారి డిమాండ్లు ఇంకా పాతకాలం భ్రమల చుట్టూనే తిరుగుతున్నాయి. వారు సంఘటితంగా పోరాడటంతోపాటు ఆదాయం చుట్టూ సరైన డిమాండ్లను కూడా లక్ష్యాలుగా తీసుకుంటేనే, నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను వాటికి జోడిస్తేనే అంతిమంగా విజయం సాధించగలుగుతారు.

✦ తెలంగాణలో ఈ ఎన్నికల్ని చూశాక.. వ్యక్తులు-అంకెల విన్యాసాల చుట్టూ జరగనున్న 2019 ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా ఎంత భయంకరంగా ఉంటాయోనన్న ఆందోళన కలుగుతోంది. అందులోనూ కేసీఆర్ కూడా ఏపీలో వేలుపెడతానంటున్నారు.

✦ అసలు ప్రభుత్వాలు ఏం చేయాలి? అనే ప్రశ్నపై చర్చించి ఇప్పటికైనా పార్టీలన్నీ కొన్ని మౌలికాంశాలపై ఏకాభిప్రాయానికి రావటం అవసరం. ఇందుకోసం పార్టీలకతీతంగా లోక్‌సత్తా సురాజ్య ఉద్యమాన్ని చేపట్టింది, 2012లో జేపీ సురాజ్య ఉద్యమ నిరాహారదీక్ష కూడా చేశారు. ఇలాంటి ఎజెండాపై పార్టీలన్నీ కలిస్తే ప్రజలు కూడా సంతోషంగా సహకరిస్తారు. రాజకీయ నష్టం లేకుండానే దీన్ని సాధించవచ్చు. ఇంత ధనరాజకీయాన్ని చూశాకైనా, పార్టీలు, అభ్యర్థులు విషవలయం నుంచి బైటపడేందుకు ఆలోచన చేయాలి.

ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. అయితే, ఐదేళ్ల దాకా పాలకులు ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే లైసెన్సు కాదు ఈ తీర్పు! ఎన్నికల మధ్య కూడా ప్రజలకు పాత్ర ఉంటుంది, ఉండాలి కూడా. అందుకే అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలు, స్థానిక సాధికారత, మహిళల రక్షణ-చట్టబద్ధపాలనకు స్థానిక కోర్టుల ఏర్పాటు, లాభసాటి వ్యవసాయం కోసం గట్టిగా పోరాడదాం, కేంద్రంతో కొట్లాడైనా ఇతర రాష్ట్రాలను కలుపుకుంటూ ఫెడరలిజాన్ని బలోపేతం చేద్దాం, తెలంగాణ ఉద్యమ లక్ష్యమైన నిజమైన స్వయంపాలనను సాధిద్దాం. ❐

# జాలర్లను విడిపించేందుకు చర్యలు చేపట్టండి

ఉపాధి కోసం గుజరాత్ తీరప్రాంతాలకు వెళ్లి సముద్ర జలాల్లో దారి తప్పి పాకిస్తాన్ చెరలో చిక్కుకుపోయిన భోగాపురం మండలం తిప్పలవలస, ముక్కాం ప్రాంతాలకు చెందిన జాలర్లను వెంటనే విడిపించేందుకు చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో జిల్లా ఎస్పీ పాలరాజును కలిసి కోరారు. సమస్యపై పోలీసులు వేగంగా స్పందించారని, బాధిత కుటుంబాలకు న్యాయం చేసే వరకూ ఈ చిత్తశుద్ధిని కొనసాగించాలని అన్నారు.



# దివ్యాంగుల ఎదిగే హక్కును పరిరక్షించాలి



దివ్యాంగులు జీవించే, ఎదిగే హక్కును కాపాడటానికి ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్టు ప్రకటనలు గుప్పిస్తున్నా, క్షేత్రస్థాయిలో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని బాబ్జీ అన్నారు. 2016 దివ్యాంగుల చట్టాన్ని అమలు చేసి రాష్ట్ర ప్రభుత్వం వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. విజయనగరం కలెక్టరేట్ వద్దనున్న అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శారీరక వికలాంగుల సంఘాల ఐక్యవేదిక సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ర్యాలీలో కూడా పాల్గొన్నారు. దివ్యాంగుల్లో ఉన్న ప్రత్యేక ప్రతిభను వెలికితీసేలా కార్యక్రమాల్ని, పథకాల్ని అమలు చేయాల్సిన దివ్యాంగ సంక్షేమ శాఖ దారి తప్పిందని బాబ్జీ విమర్శించారు. లోక్‌సత్తా ఎజెండా పేద, మధ్యతరగతి వర్గాలతోపాటు దివ్యాంగులకు కూడా ఎంతో మేలు చేసే విధానాలున్నదని, దివ్యాంగుల పోరాటానికి తాము పూర్తి మద్దతునిస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ, తమ డిమాండ్లు అమలు చెయ్యాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో రోస్టర్ పాయింట్ 56 నుంచి మార్పు చేసి 10లోకి





తీసుకురావాలని, దివ్యాంగుల రిజర్వేషన్లను 3 నుంచి 5 శాతానికి పెంచాలని, ప్రతి జిల్లా కేంద్రంలో స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చెయ్యాలని, మానసిక వైకల్యం గలవారికి ప్రత్యేక భద్రత కల్పించాలని, అర్హత గలవారికి ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వేదిక జిల్లా అధ్యక్షుడు పట్నాల ఉమామహేశ్వరరావు కార్యక్రమానికి సారథ్యం వహించారు. సమావేశంలో రాష్ట్ర ప్రతినిధులు నాగేంద్ర, గోపాల్‌రెడ్డి, ఉజనప్ప, దుర్గారావు, రెడ్డప్ప, రమేష్, లక్ష్మణరావు, కరక వెంకటరమణ, జేసుదాసు, రాజ్‌కుమార్, అప్పలనాయుడు, దేవిడ్‌రాజు, పెద్దసంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ పరిపాలనాధికారి చిన్నారావుకి డిమాండ్ల పత్రం అందజేశారు.

# 497 ...
# తెలిసియు తెలియని నరు దెల్ప బ్రహ్మదేవుని వశమే

- పి.వి గోపాలకృష్ణ



ఒకరికొకరు నచ్చి చేసుకున్న నిర్ణయమైనా, పెద్దలు నిర్ణయించినదైనా, ఇద్దరు కలిసి బతకడం అన్నది పెళ్ళి అన్న తంతుతో ప్రారంభం అవుతుంది. అది బహిరంగంగా ఆడంబరంగా ఆర్భాటంగా – హిందూ సంప్రదాయ పద్ధతిలో వేద మంత్రాలతోనో, క్రిస్టియన్ పద్ధతిలోనో, ముస్లిం మతాచారంతోనో, మరేతర మత సంప్రదాయ పద్ధతిలో – జరిగినా, ఇవేవీ లేకుండా సాదాగా వారి ఇద్దరు ముగ్గురు బంధువుల మిత్రుల సమక్షంలో ఏ గుళ్ళోనో, రిజిస్ట్రార్ ఆఫీసులో జరిగినా, అసలివేవీ లేకుండా శ్రీ సుప్రీం కోర్ట్ ఆశీస్సులు పొందిన సహజీవన విధానమైనా, ఇద్దరూ కలిసి ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు – కలిసి బతుకుదాం అన్న ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు – ఇద్దరూ జీవితకాలం పాటు కలిసి ఉండాలని తీసుకునే నిర్ణయమే గాని కాంట్రాక్ట్‌లాగా కొంతకాలం పాటు మాత్రమే అని అనుకోరు. దానికి పెళ్ళి తంతులో భాగంగా అర్థంకాని వేద మంత్రాలతో పురోహితులు పలికించే నాతిచరామి లాంటి పెళ్ళినాటి ప్రమాణాలతోనో, చర్చ్ మాస్‌లో ''Do you take.... as lawful wife/ husband, to have and to hold, from this day forward, for better or for worse, for richer or for poorer, in sickness and in health, to love and cherish until death do you part?— అని Priest తో పాటు వల్లించే Wedding Vows తోనో ప్రమేయం లేదు. ఆ క్షణంలో ఇద్దరి మధ్యా ఉన్న మానసిక స్థితి.. ఈ స్థితిలోని దృఢత్వం కాలంతో పెరగడం లేక సన్నగిల్లడం వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. దానికి పరస్పరం ఒకరిమీద ఒకరికుండే ఇష్టం, గౌరవం, నమ్మకం, విశ్వాసం – trust, faith – దోహదం చేస్తాయి. ఈ సన్నగిల్లడం ఆ పెళ్ళి పెటాకులయ్యే అనేక సమస్యలకి దారితీస్తుంది. అందులో ఒకటి వివాహేతర సంబంధం. అంటే వివాహేతర సంబంధం వల్ల కలతలు కాదు, కలతల వల్ల వివాహేతర సంబంధాలు ఏర్పడతాయి అని జస్టిస్ మిశ్రా తన తీర్పు పాఠంలో చెప్పిన మాట.

ఒకప్పటి సామాజిక పరిస్థితులు, ఆలోచనా ధోరణికి, ప్రస్తుతం అరవై సంవత్సరాల మధ్య కాలంలో వచ్చిన తేడా భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 497 విశ్లేషణలో గమనించగలం.

గత 67 సంవత్సరాలలో నాలుగుసార్లు ఈ సెక్షన్ రాజ్యాంగబద్ధతని సుప్రీంకోర్ట్ పరిశీలించింది.

పరపురుషుడి భార్య అని తెలిసీ ఒకామెతో (వివాహేతర) లైంగిక సంబంధం కలిగిఉన్నతనిని శిక్షించడానికి ఉద్దేశించినది సెక్షన్ 497. కానీ ఈ సెక్షన్ కింద ఆ వివాహిత స్త్రీ శిక్షార్హురాలు కాదు. అంతే కాదు అటువంటి వ్యక్తిని శిక్షించమని అడిగే హక్కు ఆమె భర్తకుంటుంది, ఆ స్త్రీకి కాని ఆమెతో సంబంధం పెట్టుకున్నతని భార్యకుగాని లేదు. మొదటిసారి ఈ వివక్ష – gender bias – సరిదిద్దవలసిన అవసరం 1951లో సుప్రీంకోర్ట్‌కి కలిగింది. అటువంటి వ్యక్తితో సంబంధం పెట్టుకున్న స్త్రీ కూడా సమానంగా శిక్షార్హురాలే అని యూసఫ్ అజీజ్ అనే అతను వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్ట్ పరిశీలించింది. ఇది శిక్షలో సమానత్వం కోసం వేసిన పిటిషన్. వివాహేతర సంబంధం పెట్టుకున్న స్త్రీని కూడా సమానంగా శిక్షించాలని వేసిన పిటిషన్. అంతేకాదు స్త్రీని వివాహేతర సంబంధానికి ప్రోత్సహించే సెక్షన్ అని కూడా వాదించడం జరిగింది. ఈ సెక్షన్ రాజ్యాంగబద్ధతని ఒప్పుకుంటూ వివాహేతర సంబంధానికి పురుషుడే కారకుడని స్త్రీ కేవలం బలిపశువని (victim), రాజ్యాంగంలో ఆర్టికల్ 15 (3) కింద స్త్రీలు పిల్లల కోసం అటువంటి

ప్రత్యేక ఏర్పాటు రాజ్యాంగబద్ధమేనని 1954లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆమెకి శిక్ష నుంచి తప్పించుకునే అవకాశం ఉందే తప్ప తన మీద ఆ నేరం చేసిన వ్యక్తి మీద కేసు పెట్టే హక్కు లేదు. ఆ నేరం వల్ల దెబ్బతిన్న మరో స్త్రీకి తన భర్త మీద కేసు పెట్టే ప్రసక్తే ఆ సెక్షన్‌లో లేదు. మరొక విషయం.. తన ప్రమేయం, ఒప్పుదల, అనుమతి లేకుండా తన భార్యతో లైంగిక సంబంధమైతేనే ఆ భర్తయినా కేసు పెట్టగలుగుతాడు. అంటే తన లైంగిక సంబంధం ఆమె భర్త అనుమతితోనే (consent, connivance) అని అనగలిగే సమాజమా ఆనాటిది? ఏది ఏమైనా ఆనాటి సమాజం స్త్రీని పూర్తిగా ఒక వస్తువుగా చూసిందన్నది నిర్వివాదాంశం.

మరో ముప్పై ఏళ్ల తర్వాత 1985లో రెండో వివాహేతర సంబంధాల సౌమిత్రి విష్ణు కేసు సుప్రీం కోర్ట్ ముందుకొచ్చింది. వివాహ వ్యవస్థ పవిత్రత (sanctity) ని పరిరక్షించడం అన్న కారణానికి 'బాధిత' స్త్రీని వివాహేతర సంబంధాల కేసు నుంచి తప్పిస్తూ సుప్రీం కోర్ట్ తీర్పునిచ్చింది. అంటే బాధిత భార్య తన భర్త మీద గాని, బాధిత భర్త తన భార్య మీద గాని కేసు పెట్టే సావకాశం లేదు. అంతేకాదు, అటువంటి స్త్రీ అవివాహిత అయినా తన భర్తకి మరో అవివాహిత స్త్రీకి లైంగిక సంబంధం ఉందని కూడా కేసు పెట్టే హక్కు ఆ భార్యకి లేదు. ఒక పురుషుడి వివాహిత, అవివాహిత స్త్రీలతో లైంగిక సంబంధం కొరకరాని కొయ్యగా తయారైంది. సెక్షన్ 497లో వివాహేతర లైంగిక సంబంధం అన్నది ఇద్దరు మగపురుషుల మధ్య తేల్చుకోవలసిన విషయంగా మిగిలిపోయింది.

1988లో రేవతి కేసులో భార్యాభర్తల మధ్య సయోధ్యకి ప్రయత్నించడానికి వివాహ వ్యవస్థ పవిత్రత దృష్ట్యా స్త్రీని లైంగిక సంబంధాల కేసులో దింపకుండా ఉండడమే సామాజికంగా మంచిదని సుప్రీం కోర్ట్ భావించింది.

కానీ లా కమిషన్ 1971 – 42 వ రిపోర్టులోను, 2003 క్రిమినల్ లా సంస్కరణల మాలిమత్ కమిటీ రిపోర్టు కూడా సెక్షన్ 497లోని లింగవివక్షను ప్రస్తావించాయి.

2012 కల్యాణి కేసులో కూడా ఈ సెక్షన్‌లోని లింగవివక్షను ప్రస్తావించడం జరిగింది.

ఇదీ ఈ ఏడాది సెప్టెంబర్ 27న సుప్రీం కోర్ట్ ఇచ్చిన సంచలన తీర్పు చారిత్రక నేపథ్యం.

ఈ సెక్షన్ పూర్తిగా లింగవివక్షతో కూడుకుని ఉంది అని చాలామంది ఉద్దేశం. అంటే ఈ నేరంలోని స్త్రీ భాగస్వామ్యాన్ని గుర్తించాలన్నదే చాలామంది అభిప్రాయం. పురుషుడితోపాటు స్త్రీ కూడా సమానంగా శిక్షించబడాలని కొందరి ఆకాంక్ష.

2017లో జోసెఫ్ షైన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని గత డిసెంబర్ 8న సుప్రీం కోర్ట్ ధర్మాసనం విచారణకు తీసుకుంది. పిటిషన్‌లో పేర్కొన్న పై నాలుగు కేసులలోని తీర్పులని క్షుణ్ణంగా పరిశీలించి మారుతున్న సామాజిక విలువలు, అభివృద్ధి, లింగవివక్ష, సమానత్వం అంశాలని దృష్టిలో పెట్టుకుని ఈ సెక్షన్ రాజ్యాంగబద్ధతని ఇంకా పెద్ద సుప్రీం కోర్ట్ ధర్మాసనం నిర్ణయించవలసిన అవసరం ఉందని గత జనవరి 5న అభిప్రాయపడింది.

తదనుగుణంగా సెప్టెంబర్ 27న ఐదుగురు జడ్జీలతో కూడిన సుప్రీం కోర్ట్ రాజ్యాంగ ధర్మాసనం ఈ సెక్షన్‌లోని లింగవివక్షను గుర్తించి స్త్రీ పురుషుల వ్యక్తిగత స్వేచ్ఛ సమానత్వాలని ఉద్ధరిస్తూ తీర్పుని వెలువరించింది. పిటిషన్‌లో కోరినట్లు లింగభేదం లేకుండా స్త్రీపురుషులిద్దరూ నేరస్తులే, ఇద్దరూ శిక్షార్హులే అన్న కోర్ట్ తీర్పు వస్తుందనుకున్నవారి ఎదురుచూపులకి భిన్నంగా ఈ సెక్షన్‌లోని నేర ప్రవృత్తిని సుప్రీం కోర్ట్ పూర్తిగా నిర్జించడం చాలామందికి మింగుడుపడలేదు. జస్టిస్ డి.వై చంద్రచూడ్ వాడిన పదజాలం స్త్రీ లైంగికస్వేచ్ఛ sexual autonomy విశృంఖలత్వంగా భావించేవారి సంఖ్య ఇంకా తగ్గలేదు.

మగవాడి anatomy పై autonomy మగవాడిదే, అలాగే ఆడదాని anatomy పై autonomy కూడా మగవాడిదే– ఆడదానిదేనండీ బాబూ. అదేదో సినిమాలో రాజేంద్రప్రసాద్ బ్రహ్మానందంతో అన్నట్టు– శంకరాభరణం కథ చెప్తే అడవిరాముడు అర్థం చేసుకున్నారేంటండీ–

రాజ్యాంగపరంగా స్త్రీ పురుషులిద్దరూ సమానమే. అదే వ్యక్తిస్వేచ్ఛ. అది కేవలం ఒకరికే పరిమితం చేస్తే లింగవివక్ష.

ఈ సెక్షన్ ప్రకారం ఒక నేరం జరిగినప్పుడు ఒకరిని మాత్రమే నేరస్తులుగా చెయ్యడం రెండవవారిని క్షమించడం ఎంతవరకు సమంజసం అని పరిశీలించి నిర్ణయించడం వరకే శ్రీ కోర్ట్‌వారి పరిధి. సెక్షన్‌లో లేని విషయాలు చేర్చి scope of the section పెంచి స్త్రీ శిక్షార్హురాలే అనో, ఉన్నవి – భర్త ప్రమేయం, ఒప్పుదల, అనుమతి, consent, connivance – లాంటివి తీసేసి కీలుబొమ్మ భర్తలు గానీ – cuckold husbands – బాధిత భార్యలు గానీ ఈ నేరంలో సమంగా పాల్గన్న స్త్రీ పురుషుల మీద కేసు పెట్టే సావకాశాన్ని కలుగజేయడం శాసన వ్యవస్థ పరిధిలోవి. ఆ మార్పులు రాజ్యాంగబద్ధమా కాదా అని విశ్లేషించే అధికారం మళ్ళా శ్రీ కోర్ట్‌వారిదే.

స్త్రీపురుషులిద్దరికీ సమానంగా స్వేచ్ఛనివ్వడమా లేక ఇద్దరూ

నేరస్తులే అని శిక్షార్హులని చెయ్యడమా తద్వారా మాత్రమే వివాహ వ్యవస్థ పవిత్రత, కుటుంబ వ్యవస్థ బలోపేతం చెయ్యడం సాధ్యమా అన్నది ప్రశ్న. బంతి ఇప్పుడు శాసనవ్యవస్థ చేతుల్లో ఉంది. క్రిమినల్ లా, క్రిమినల్ ప్రొసీజర్, పెళ్ళిళ్ళు, విడాకులు, శిశువులు, మైనర్ల దత్తత, అవిభక్త కుటుంబాలు తదాది 52 విషయాలు రాజ్యాంగంలో కన్కరెంట్ (ఉమ్మడి) లిస్ట్‌లో ఉన్న విషయాలు. అంటే పార్లమెంటే కాదు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విషయాలకి సంబంధించిన చట్టాలు చేయడానికి రాజ్యాంగపరమైన సౌలభ్యం ఉంది.

ఇదేకాక సెక్షన్ 377లోని ఇద్దరు వయోజనుల మధ్య పరస్పర అంగీకారంతో కూడిన స్వలింగ సంపర్కం కూడా నేరం కాదన్న సుప్రీం కోర్ట్ తీర్పు నేపథ్యంలో, కొన్ని ఊహాతీతమైన పరిస్థితుల్లో భార్యాభర్తలు, వివాహేతర సంబంధాలు మాత్రమే కాక మరికొన్ని 'కారణాలు' చూపిస్తూ కూడా విడాకుల కోసం కోర్టుకెక్కే అవకాశాలని శాసన వ్యవస్థ పరిశీలించి విడాకుల చట్టాలలోని అంశాల పరిధి కూడా పెంచవలసిన అగత్యం ఉంది.

వానాకాలం అయిపోయింది. రాబోయేది ఎన్నికల కాలం. ఏ పార్టీ అయినా సరే ఏ అభ్యర్థయినా సరే సెక్షన్ 497ని ఐపీసీలో ఉంచుతారా, తీసేస్తారా, తీసేసి స్త్రీపురుషులిద్దరికీ స్వేచ్ఛనిస్తారా, ఉంచి ఇద్దరినీ శిక్షార్హులని చేస్తారా అని అడిగిచూడండి. మింగాలో కక్కాలో తెలియక కొట్టుమిట్లాడతారు.

వెళుతూ వెళుతూ దీపక్ మిశ్రా తాను చేయగలిగినదంతా చేసే వెళ్ళేరు.

సుప్రీం కోర్ట్ విధివిధానాలు, పని విధానం తెలిసీ తెలియని నరుదెల్ప..... ❐

# చంద్రన్న బీమాను మళ్లీ సర్వేతో విస్తరించాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా కొందరికి మాత్రమే చేరుతోందని, రెండవసారి సర్వే చేయకపోవటం వల్ల చాలామంది పేదలు బీమా అందక నష్టపోతున్నారని లోక్‌సత్తా పార్టీ నేతలు అన్నారు. ప్రభుత్వం మళ్లీ సర్వే చేయించి అర్హుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ మేరకు లోక్‌సత్తా విజయనగరం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం పార్టీ నేతలతో కలిసి మెప్మా పీడీని కలిసి లిఖితపూర్వకంగా కోరారు. 2010 నుంచి ఇప్పటి వరకు మెప్మా పరిధిలోని విద్యార్థుల స్కాలర్‌షిప్పులు సక్రమంగా అంద లేదన్నారు. ఎస్.సి, ఎస్.టి నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మెప్మా పరిధిలోని నిరుద్యోగులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులు దుర్వినియోగం జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై వివరాలు అందివ్వాలని అడిగారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు మునిసిపాలిటీలకన్నా విజయనగరం మునిసిపాలిటీ పరిధిలోని మెప్మా కార్యక్రమాలు ఎందుకు వెనకబడి ఉన్నాయని ప్రశ్నించారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో త్వరలో పొదుపు సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీడీని కలిసినవారిలో లోక్‌సత్తా పార్టీ పట్టణ కార్యదర్శి తాత్రాజు రాజారావు, చప్ప మధు, గురునాథం, చిన్నారావు, పోలుపర్తి అప్పారావు తదితరులు ఉన్నారు.

**భారత రాజ్యాంగం స్త్రీ, పురుషులకు సమాన హక్కులనిచ్చింది. అలాంటప్పుడు భర్త అనుమతి ఉండటం అంటే భార్యను సొంత ఆస్తిగా భావించటమే, ఇది స్త్రీల సమాన హక్కుకు భంగం వాటిల్లే విషయమే అవుతుంది. సెక్షన్ 497 చెల్లకపోతే స్త్రీలకు స్వతంత్రత, గౌరవం, లైంగిక స్వేచ్ఛ ఉన్నట్లుగా భావించటం సత్యదూరం కాదు. అయితే సెక్షన్ 497 చెల్లకపోవటం ప్రత్యక్షంగా పురుషుల వివాహేతర సంబంధాలకు రక్షణ కవచమైనంతగా స్త్రీల విషయంలో లైంగిక స్వేచ్ఛ, గౌరవం, స్వతంత్రాలకు భద్రత ఉంటుందా?**



# నేరమా?

- డా.జె. కనకదుర్గ

వివాహేతర లైంగిక సంబంధాలలో 'స్త్రీపురుషుల భాగస్వామ్యం ఉన్నప్పుడు కేవలం పురుషుడినే నేరస్తుడిగా భావించటం న్యాయమా?' అన్న ప్రశ్న ఎదురవటంతో భారతదేశపు అత్యున్నత న్యాయస్థానం సెక్షన్ 198 (ఇండియన్ పీనల్ కోడ్-1860)లో చెప్పినట్లుగా నేరం కాదని చెబుతూ, సెక్షన్ 497 (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-1973) ప్రకారం వివాహేతర సంబంధం పెట్టుకునే వారికి భర్త అనుమతి ఉండాలనే నిర్దేశాన్ని నిరాకరించింది. అనుమతివ్వటం అంటేనే భర్త భార్యను తన సొంత ఆస్తిగా భావించటమేననీ, అది సమాజంలో పురుషుడిని పైచేయిగా భావిస్తోందనీ, తద్వారా స్త్రీల సమాన హక్కుకు భంగం వాటిల్లుతోందని భావించి సెక్షన్ 497ని కాలం చెల్లినదిగా తీర్పునిచ్చింది. ఈ తీర్పు రెండువైపుల పదునున్న కత్తి వంటిది.

వివాహేతర సంబంధం నేరం కాదనే సరికి పురుషులందరూ ఆనందపడే విషయం. అలాగే భార్యను భర్త ఆస్తిగా భావించటానికి వీలులేదనే సరికి స్త్రీలందరికీ ఆమోదయోగ్యమయింది. కాని ఏదో అలజడి. సామాన్య స్త్రీలు మాత్రం పురుషుల వివాహేతర సంబంధాలు నేరం కాకపోతే విచ్చలవిడితనం పెరిగిపోతుందనీ, స్త్రీలకూ మరింతగా అభద్రత కలుగుతుందనీ, విడాకులు ఎక్కువై కుటుంబాలు అస్తవ్యస్తమవుతాయని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఎక్కువ అవుతారని ఆందోళన చెందటం సహజమే. అదే సమయంలో వివాహేతర సంబంధాలు నేరం కాకపోయినా సామాజిక తప్పిదమనీ, లైంగిక విషయాలలో భార్యను భర్త ఆస్తిగా భావించకపోతే స్త్రీలకు స్వతంత్రత, లైంగికస్వేచ్ఛ ఉంటుందన్న భావనలు ఈ తీర్పులో వ్యక్తం కావటం కాస్తంత ఊరటనిచ్చే విషయమే అవుతుంది. వాస్తవంగా సమాజంలో స్త్రీ, పురుష సంబంధాల విషయంలో స్త్రీలే ఎక్కువగా నిందితులు. సెక్షన్ 497 అమలులో ఉన్నప్పటికీ, ఆచరణలో వివాహేతర సంబంధ విషయాలలో పురుషులు నేరస్తులుగా నిరూపింపబడి శిక్షకు గురి అయిన సందర్భాలు తక్కువే. కాని భార్యల పాతివ్రత్యాన్ని అనుమానించి, శారీరకంగా మానసికంగా వారిని శిక్షించటం నిత్యకృత్యంగా కనపడేవే. కాబట్టి సెక్షన్ 497 ఉన్నా లేకపోయినా స్త్రీ బాధితురాలిగానే నేటికి కనబడుతోంది.

స్త్రీపురుష సంబంధాల మౌలికతను విశ్లేషణకు పెట్టినప్పుడు తీర్పుకు సంబంధించిన అలజడిని అర్థం చేసుకోవచ్చు. మానవులు సంచార జీవులుగా ఉన్నప్పటి గుంపు సంబంధాలలోని లైంగిక పీడనను వదిలించుకోవాలని భావించిన స్త్రీ ఏకకాలంలో ఒక్క పురుషుడితోనే జతకట్టి ఉండటం జరిగింది. ఇష్టం లేనప్పుడు వదిలిపెట్టి వెళ్లిపోయి నచ్చిన మరొక పురుషుడితో జత కట్టే స్వేచ్ఛ ఉండేది. ఆ స్వేచ్ఛను హరించే క్రమంలో పెళ్ళి, కుటుంబం ఉనికిలోకి వచ్చి ఒక భార్య ఒక భర్త అనే జీవితకాల పద్ధతికై వివాహ వ్యవస్థ వచ్చిందని మానవ నాగరికతను విశ్లేషణకు పెట్టిన సామాజికవేత్తలు గ్రహించిన విషయం.

కాలక్రమేణా గుంపు సంబంధాల వాసనలను వదిలించుకోలేని పురుషులు బహుభార్యాత్వాన్ని, వేశ్యావ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. నిజంగా ఇది పురుషుల ఆధిపత్యానికి చిహ్నమే.

తరతరాలుగా ఇటువంటి అనైతిక పితృస్వామ్య సంస్కృతి స్త్రీలను శిక్షకు గురిచేయటాన్ని సాహిత్యం స్పష్టం చేస్తోంది. ఉదాహరణగా రామాయణంలో ఇంద్రుడి భాగస్వామ్యం ఉన్నా కఠిన శిక్షకు గురి అయినది అహల్య మాత్రమే. అంటే గౌతముడు తన భార్యను సొంత ఆస్తిగా భావించటమే. అలాగే లైంగికస్వేచ్ఛను కోరుకున్న శూర్పణఖను 'మనుస్మృతి ప్రకారం' ముక్కు చెవులు కోసే శిక్షకు గురిచేయటం తెలిసిన విషయము. బహుభార్యాత్వం, వేశ్యావ్యవస్థలను భారతేతిహాసాలు స్పష్టం చేస్తాయి. అయితే 'స్త్రీ' భర్తకైనా, తండ్రికైనా ఆస్తి కిందనే భావింపబడేది. ధర్మరాజు ద్రౌపదిని పణంగా పెట్టటంలోనూ, సత్యహరిశ్చంద్రుడు చంద్రమతిని కాలకౌశికునికి అమ్మటంలోను ఈ విషయం అర్థమవుతుంది. అంతేకాదు యయాతి మహారాజు గుర్రాలు కొనటానికి తగిన సంపద సరిపోక, దానికి బదులుగా తన కూతురైన మాధవిని కాలవ్యుడికి తాకట్టు పెట్టటం, అతను మరికొంతమంది పురుషులకు ఇవ్వటం జరిగి, మాధవి ప్రతి ఒక్కరికి పిల్లల్ని కని యిచ్చిందని చెప్పబడిందంటే భర్తకైనా, తండ్రికైనా స్త్రీని ఆస్తి కింద భావించే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. నిజంగా ఇలాంటి సందర్భంలో సెక్షన్ 497ను రద్దు చేయటం సమంజసమే.

సమాజం బాగా ప్రతిఫలించిన మధ్యయుగాల సాహిత్యంలో భర్తల వివాహేతర సంబంధాల విచ్చలవిడితనానికి సవాలుగా భార్యలు కూడా వివాహేతర సంబంధాలు నెరపినట్లు తెలుస్తుంది. సెక్షన్ 198ను రద్దు చేస్తే అలాంటి విచ్చలవిడితనం ఏర్పడుతుందని ఈనాటి అలజడిగా భావిస్తున్నారు. కథాకావ్యాలలో భార్యల విషయంలో పితృస్వామ్యపు అదుపులో భాగమైన పాతివ్రత్యాన్ని కాపాడే బాధ్యత వహించిన రాజ్యం, భటులు, భర్త, ఆఖరికి దొంగ కూడా సాక్ష్యమిచ్చి ఆ భార్యలు శిక్షకు గురి అయ్యేటట్టు చేసినట్లు చెప్పడం జరిగింది. అంటే లైంగికస్వేచ్ఛ విషయంలో పురుషుడికొక నీతి, స్త్రీకొక నీతి అన్నది స్పష్టమైన విషయమే. స్త్రీ పురుషుల విషయాలలో సమాన న్యాయం ఉండాలనుకోవటమే సెక్షన్ 198, 497ల రద్దు ప్రయోజనం. అయితే కథా కావ్యాలలో కుటుంబంలోని అసంతృప్తుల వల్లనే స్త్రీలు వివాహేతర సంబంధాలు పెట్టుకున్నట్టు అర్థం అవుతుంది. వివాహేతర సంబంధాలలో తృప్తి పొందిన భార్యలున్నారంటే వారికి భర్తల యెడ ఉన్న అసంతృప్తే కారణమని అర్థం అవుతుంది. అదే సమయంలో భర్తలకు భార్యల యెడ అటువంటి అసంతృప్తి ఉండే అవకాశం లేదని అర్థం అవుతుంది. స్త్రీల విషయంలో కుటుంబంలోని అసంతృప్తి వల్ల వివాహేతర సంబంధాలు పెట్టుకున్నట్లు భావించవచ్చు. ఇది స్త్రీ పురుషులిద్దరికీ వర్తించే విషయమే.

ప్రజాస్వామ్య భావాలు అభివృద్ధి చెందుతున్న సమయంలో బ్రిటిష్ పాలనలో వచ్చినదే సెక్షన్ 198. పురుషుల వివాహేతర సంబంధాలు నేరమని చెప్పింది. బూచి భయం పెట్టటంతో కొద్దిగా తగ్గుముఖం పట్టి యుండవచ్చు. అలాగే పితృస్వామ్య కుటుంబాలలో భర్తల అనుమతి ఉండటం దుర్లభం కాబట్టి సెక్షన్ 497లో దానిని చెప్పటం జరిగింది. ఇది పురుషుల గొంతులో వెలక్కాయ పడటం వంటిదే. స్వతంత్ర భారత రాజ్యాంగం స్త్రీ, పురుషులకు సమాన హక్కులనిచ్చింది. అలాంటప్పుడు భర్త అనుమతి ఉండటం అంటే భార్యను సొంత ఆస్తిగా భావించటమే, ఇది స్త్రీల సమాన హక్కుకు భంగం వాటిల్లే విషయమే అవుతుంది. సెక్షన్ 497 చెల్లకపోతే స్త్రీలకు స్వతంత్రత, గౌరవం, లైంగిక స్వేచ్ఛ ఉన్నట్లుగా భావించటం సత్యదూరం కాదు. అయితే సెక్షన్ 497 చెల్లకపోవటం ప్రత్యక్షంగా పురుషుల వివాహేతర సంబంధాలకు రక్షణ కవచమైనంతగా స్త్రీల విషయంలో లైంగిక స్వేచ్ఛ, గౌరవం, స్వతంత్రాలకు భద్రత ఉంటుందా? అనేది అనుమానాస్పదమే.

నేటి ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీలు తమ వ్యక్తిత్వాలకు విలువనిచ్చుకుంటూ అభివృద్ధి చెందుతున్నారు కాబట్టి విద్యావంతులు, ఆర్థిక స్వాతంత్ర్యం కలిగినవారు, గౌరవంతో కూడిన జీవితం కావాలనుకునే స్త్రీలు లైంగిక స్వేచ్ఛను బాధ్యతాయుతంగానే వినియోగించుకునే విచక్షణ జ్ఞానం కలిగినవారై ఉంటారు. అందుకనే స్త్రీల వ్యక్తిత్వానికి విలువలేని పితృస్వామ్య కుటుంబాలలోని డొల్లతనాన్ని, పెళ్ళిలోని అసమానత్వాన్ని గుర్తించి అసలు పెళ్ళి, కుటుంబం అవసరమా అనే ఆలోచనలు పెరిగాయి. తత్ఫలితంగా స్త్రీపురుషుల మధ్య సమానత్వం, గౌరవం, స్నేహం, ప్రేమ కలిగిన ఏక కాల ఏక వ్యక్తి నిష్ఠమైన లైంగిక సంబంధాలకు అనువైనది 'సహజీవనం' అంటూ కథ, నవలా సాహిత్యం వచ్చింది. అయితే స్త్రీల నిరక్షరాస్యత, ఆర్థిక అభద్రత, ఒంటరితనం, వస్తు సంస్కృతి మోజు వెరసి సహజీవనం చేయాలనుకోవటం, చివరికి భార్య/భర్తల హత్యలు లేదా ఆత్మహత్యలకు దారితీసే పరిణామాలు జరుగుతున్నాయి. కాబట్టి ఏదేమైనా ముందు అభివృద్ధి చెందిన దేశాలలో వలే భారతదేశంలో కూడా స్త్రీ, పురుషులు జ్ఞానవంతులు కావాలి. ఫలితంగా ఒక జ్ఞానవంతమైన సమాజం తయారవుతుంది. అప్పుడే స్త్రీ పురుషులు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా వారి జీవితాలు చెడు పర్యవసానాల బారిన పడకుండా ఆ సమాజం దన్నుగా నిలబడగలుగుతుంది. ❐

**(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)**

# ఛాందస శక్తులకు, నియంతృత్వ రాజకీయానికి ఊతమిచ్చే తీర్పులు

ప్రజలను తరతరాల ఛాందసాల నుంచి బైటపడేయటానికే ఎంతో ఉదాత్తమైన భావాలను జోడించి జాతీయోద్యమకాలం నాటి నేతలు రాజ్యాంగాన్ని అందించారు. ఇదేదో తాము అనుగ్రహిస్తున్న వరంగా చెప్పుకోకుండా.. ప్రజలు తమకు తాము ఇచ్చుకున్న సార్వభౌమాధికార దిశానిర్దేశ పత్రంగా వారు వినమ్రంగా పేర్కొన్నారు. ఆ రాజ్యాంగంలోని అంశాలను సరైన భాష్యంతో, విజ్ఞతతో అన్వయిస్తూ చట్టసభల్లో సరైన చట్టాల్ని చేసినా లేదా న్యాయస్థానాలు తమ పరిధిలో సరైన తీర్పుల్ని ఇచ్చినా ఆ సమాజం సుఖపడుతుంది. కానీ మొక్కుబడిగా చట్టాల్ని చేసినా, సంచలనం కోసం తీర్పులనిచ్చినా ఆ సమాజానికి సమస్యలు ఇంకా జటిలమవుతాయి. వివాహేతర సంబంధాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆ రకంగా సమస్యను జటిలం చేసేలా ఉందని, ప్రజల మనోభావాలను, సమాజహితాన్ని, దేశ సుస్థిరతను దృష్టిలో పెట్టుకుని దూరదృష్టితో ఇచ్చినది కాదని భావించవచ్చు.

వివాహబంధంలో మహిళల పట్ల అణచివేత ఉందనేది మెజారిటీ ప్రజలు స్థూలంగా 'ఒప్పుకునే' భావన. గొప్ప నాయకులమని చెప్పుకుంటూ ఏదోకరకంగా ఎన్నికవుతున్న పాలకుల వల్ల కాకపోయినా, లింగవివక్ష పట్ల పూర్తిస్థాయి పశ్చాత్తాపం లేకపోయినా .. సమాజంలో దానంతటది వచ్చే పరిణామక్రమం, ప్రపంచీకరణ వల్ల ఇది తప్పు అనే భావన పురుషుల్లో పెరుగుతోంది.




ఇదేదో విధి రాత, పుట్టుకతో వచ్చిన శాపం కాదనే స్పృహ స్త్రీలలో కూడా పెరుగుతోంది. పూర్వకాలంనాటి తప్పిదాల్ని యథాతథంగా అంగీకరించకుండా, ఏదో కొత్త మార్పు రావాలన్న ఊహ చేస్తూ ప్రజానీకం ఊగిసలాడుతున్న తరుణమిది. ఆ కొత్త మార్పు ఏమిటో మాత్రం వారు సరిగా గుర్తించలేకపోతున్నారు. ఈ సంధి దశలో సుప్రీంకోర్టు 'వివాహేతర సంబంధాలు క్రిమినల్ నేరం కాదు' అంటూ తీర్పునిచ్చింది.

వివాహేతర సంబంధాలలో పురుషుల చేతిలో మహిళలు కీలుబొమ్మలుగా చూపుతూ శిక్షల పద్ధతిని తెలియజెప్పే ఐపీసీ 497, సీఆర్‌పీసీ 198లను యథాతథంగా కొనసాగించాలని ఇంగితజ్ఞానమున్న భారతీయుల్లో అత్యధికులు కోరుకోవటం లేదు. కానీ ఆ సెక్షన్లను కోర్టు కొట్టివేయటాన్ని మాత్రం వారు జీర్ణంచేసుకోలేకపోతున్నారు. వివాహేతర సంబంధం అనే నేరంలో ఉన్న లింగవివక్షను తొలగించి.. ఆ తప్పు స్త్రీ కావచ్చు, పురుషుడు కావచ్చు ఎవరు చేసినా సమానంగా శిక్షార్హులే అని సుప్రీంకోర్టు చెప్పి ఉంటే న్యాయంగా, అభ్యుదయంగా, ఆచరణాత్మకంగా కూడా ఉండేదని వారు భావించారు. వారు ఆశిస్తున్న దాన్ని దాటి సుప్రీంకోర్టు తన తీర్పును ఇవ్వాలనుకున్నప్పుడు.. వారిని ఆచరణ దిశగా ఒప్పించగల హేతుబద్ధ ప్రమాణాలు తీర్పులో ఉండాలి.

వరకట్న నిషేధం చట్టాన్నే తీసుకుంటే.. కట్న జాడ్యం సమాజంలో ఇప్పటికీ యధేచ్ఛగా కొనసాగుతోంది. కానీ ఆ చట్టం తప్పు అని ఎవరూ అనలేరు. అలాగే జంతుబలి చట్టం. వివాహేతర సంబంధాలకు సంబంధించిన తీర్పులో అలాంటి హేతుబద్ధతని, ఆదర్శాన్ని కోర్టు తీర్పులో చూడలేం. వ్యక్తిస్వేచ్ఛ పేరుతో రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి వక్రభాష్యం వినిపించిందేమోనన్న సందేహం ఎటుచూసినా పీడిస్తోంది.

వివాహేతర సంబంధాలంటే వివాహం అనే పవిత్ర బంధంలో భాగమైన జీవిత భాగస్వామిని మోసం చేయటమేనని, చీటింగ్ అనేది చట్టబద్ధ నేరం కాబట్టి వివాహేతర సంబంధాలు కూడా నేరమేనని, ఈ అంశాన్ని కోర్టు విస్మరించిందని ఓ అడ్వకేట్ మిత్రుడు ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు. కానీ ఇది ఒక కోణమే. భర్తకు తెలిసి భార్య, భార్యకు తెలిసి భర్త ఎటువంటి మోసం లేకుండా 'పారదర్శకంగా' వివాహేతర సంబంధాన్ని నెరపినా కూడా దాని పరిణామాలు ఒక నేరం ద్వారా వచ్చే పరిణామాలతో సమానంగా ఉంటాయనే భావించాలి. ఒకరకంగా అది వారి సంతానాన్ని, వివాహ వ్యవస్థను దెబ్బతీసినట్టే లెక్క. కాబట్టి భార్యాభర్తల్లో ఎవరైనా లేదా ఇద్దరూ పారదర్శకంగా వివాహేతర సంబంధాల్ని ఏర్పరచుకున్నా దాన్ని నేరంగానే గుర్తించాల్సి ఉంటుంది.

వివాహమనే వ్యవస్థకు అంత ప్రాధాన్యత లేనప్పుడు, వ్యక్తిస్వేచ్ఛ పేరుతో వివాహేతర సంబంధాల్ని ఏర్పరచుకునే అవకాశం ఉన్నప్పుడు.. ఇక వ్యభిచారాన్ని కూడా వ్యతిరేకించాల్సిన పనిలేదు.

వివాహేతర సంబంధాలు పరస్పర ఆమోదంతోనే జరుగుతాయనుకోవాలి (బలవంతంగా అలాంటి సంబంధాల కోసం ప్రయత్నిస్తే, అది అత్యాచారం సెక్షన్ల కిందికి వస్తుంది). వ్యభిచారం కూడా పరస్పర ఆమోదంతోనే జరుగుతుంది. కాకపోతే ఇందులో డబ్బు పాత్రే ఎక్కువగా ఉంటుంది. వివాహేతర సంబంధాల్లో డబ్బుతోపాటు ఇతరత్రా అనేక అంశాలు ముడిపడి ఉంటాయి. వివాహేతర సంబంధాల్ని ఒకరకంగా విచక్షణతో కూడిన వ్యభిచారం అని కూడా చెప్పవచ్చు.

భారతదేశంలోని ఎక్కువమంది మహిళలకు శారీరక సుఖం కోసం వెంపర్లాడుతూ వివాహేతర సంబంధాలను ఏర్పరచుకుంటారని భావించలేం. వారికి అటువంటి సుఖాల పట్ల పెద్ద అవగాహన ఉండే అవకాశాలు ఇంకా తక్కువ. కేవలం కుటుంబ జీవితంలోని అసంతృప్తులు, తమలోని భావాల్ని మితిమీరి అణచివేసుకుని బతకాల్సి రావటం, అవతలివైపు నుంచి ఏదోక రూపంలో తమకు అవసరమైన భావోద్వేగ స్పందన, డబ్బు వంటివి అందుబాటులోకి రావటం వంటి కారణాల వల్ల వాళ్లు వివాహేతర సంబంధాల్లో చిక్కుకుంటుంటారు. సంతానానికి, కనీస శారీరక సౌఖ్యానికి భర్త పనికి రాకపోయినా కూడా మన స్త్రీలలో భరించే ధోరణే ఎక్కువ. ఒకవేళ భరించలేకపోయినా, విడాకులు తీసుకునే వెసులుబాటు చట్టరూపంలో అందుబాటులోనే ఉంది. తగిన పద్ధతిలో ఎన్నిసార్లయినా విడాకులు తీసుకోవచ్చు.

మళ్లీ ఓసారి ఇంతకుముందు ప్రస్తావనలోకి వెళ్లి కొంత వివరంగా చూద్దాం.

వివాహేతర సంబంధం అనేది కేవలం ఒక వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించినది కాదు.. ఇది కనీసం రెండు కుటుంబాలు, అందులోని పిల్లల జీవితాలకు సంబంధించిన విషయం. వివాహేతర సంబంధాన్ని ఏర్పరచుకునే వ్యక్తి స్వేచ్ఛకు.. కేవలం అవతలి వ్యక్తిని ఒప్పించటం అనే పరిమితి మాత్రమే కాదు, ఆ కుటుంబాల్లోని ఇతర వ్యక్తులు, పిల్లల భవిష్యత్తు అనే పరిమితులు కూడా ఉంటాయి. వివాహం, కలిసి జీవించటం, పిల్లలు.. అనే కుటుంబ జీవనాన్ని సుప్రీంకోర్టు ఏమాత్రం పరిగణలోకి తీసుకున్నట్టు కనిపించలేదు. వివాహంలో ఉండే సంబంధాల్ని, ఇచ్చిపుచ్చుకునే సహకారాల్ని వ్యాపార దృష్టితో, కాంట్రాక్ట్ దృష్టితోనే కోర్టు చూసినట్టు కనిపిస్తుంది. వివాహేతర సంబంధం క్రిమినల్ నేరం కాదు.. సామాజిక నేరం మాత్రమే.. అని తేల్చేసింది. కాకపోతే ఆ సామాజిక నేరాన్ని చూపుతూ విడాకులు తీసుకోవచ్చు అని సూచించింది. వివాహం అనే భావన అనేక కుదుపులకు గురవుతుందనుకున్నా.. కనీసం పిల్లల భవిష్యత్తు, వారికుండే హక్కుల గురించైనా కోర్టువారు ఆలోచించాలిగా? తల్లిదండ్రులు విడిపోతే, ఆ పిల్లలు ఎంతటి వేదనను అనుభవిస్తారు?! అది పెద్దలు చేసిన నేరసమాన తప్పిదం కాదా? ఆ నేరానికి శిక్ష ఉండదా?

గురుకుల పాఠశాలల గురించి ఈ సందర్భంలో ఉదాహరణగా చెప్పుకోవాలి.

ఇటీవల ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో గురుకుల పాఠశాలల సంస్కృతి పెరుగుతోంది. వాటిని కులాలవారీగా ఏర్పాటు చేయటం అనే తప్పిదాన్ని కాసేపు అలా ఉంచితే, తల్లిదండ్రుల ఆలనాపాలనా మధ్య చదువుకోవాల్సిన వయసులో పిల్లలు అలా హాస్టళ్లలో ఉండటం సమాజానికి ఎంత మేలు చేస్తుందో కూడా ఆలోచన చేయాలి. వలసలు, మద్యం, మానసిక సమస్యలు వంటి కారణాలతో వేధింపులు, సమస్యలు ఉండే పిల్లల్ని మినహాయిస్తే.. మిగిలిన పిల్లలు పాఠశాల (12వ తరగతి స్థాయి) వరకూ తల్లిదండ్రుల వద్దే ఉండటం వల్ల వారు సమాజం పట్ల స్పందించే తీరులో తేడా ఏర్పడుతుంది.

పూర్వం రాజుల కాలంలో ఉండే గురుకుల పాఠశాలల్లో ఇంత పోటీ ఉండేది కాదు. గురువులు కూడా ఎంతో శ్రద్ధ కనబరిచి పిల్లలకు యుక్తవయసు వరకూ బోధన చేసేవారు. ఆ తర్వాత సమాజంలోకి వచ్చాక కూడా ఆ పిల్లలకు

పెద్దగా ఆందోళన చెందాల్సిన, ఒత్తిడికి గురికావాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ ఈవేళ శిక్షణలో అంత ఆత్మీయత కనిపించే అవకాశాలు తక్కువ. బైటికొచ్చాక కూడా తీవ్ర పోటీ వాతావరణాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఒకవేళ గురుకుల పాఠశాల విద్యలో గొప్పగా చదువుకుని వచ్చి బయట వెంటనే ఉపాధి అవకాశాన్ని పొందగలిగినా, ఆ విద్యార్థి ఆలోచనలో బాంధవ్యాలకన్నా భౌతిక లాభాల పట్లే ఆపేక్ష ఎక్కువగా ఉండే అవకాశముంది. భారతదేశంలో కుటుంబ వ్యవస్థ బలమైనది కాబట్టి.. భారతీయాన్ని కాపాడుకుందాం అనే ధోరణితో ఈ మాటలు చెప్పటం లేదు. మనదేశంలో చట్టబద్ధ పాలన అధ్వాన్నంగా ఉన్నా కూడా శాంతిభద్రతలు ఈమాత్రమైనా ఉన్నాయంటే అందుకు మన కుటుంబ వ్యవస్థ బలం చాలామేర కారణం. విదేశాల్లో చట్టబద్ధపాలన మనకంటే అనేకరెట్లు బలంగా ఉన్నా కూడా, అక్కడ మహిళలపై మనదేశంలో కంటే ఎక్కువ అత్యాచారాలు జరుగుతున్నాయంటే, అక్కడ కుటుంబ వ్యవస్థ నామమాత్రంగా ఉండటమే కారణం. ఈ కుటుంబ వ్యవస్థను కాపాడుకునేలా మన చట్టాలు ఉండాలా? లేక పూర్తిగా విదేశీ అనుకరణలా కుటుంబ వ్యవస్థను ధ్వంసం చేసేలా ఉండాలా? ఏది విజ్ఞతతో కూడుకున్న న్యాయనిర్ణయమవుతుంది? వివాహ బంధం ద్వారా భార్య, భర్త అయిన స్త్రీ, పురుషుడు పరస్పర అంగీకారంతో వివాహేతర సంబంధాల్ని పెట్టుకోవటం వారిద్దరి పరిధిలో చీటింగ్ కాకపోయినా, పిల్లలు, కుటుంబ జీవనానికి మూలకారణమైన వివాహబంధాన్ని మాత్రం వారు చీట్ చేసినట్టే. పిల్లలు పెరిగి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడ్డాక కూడా దంపతీ వ్యవస్థ వల్ల వారికి, సమాజానికి కూడా చాలా అర్థవంతమైన ఫలితాలు వస్తాయి.

అలాంటప్పుడు వివాహేతర సంబంధం పర్యవసానం నేరసమాన తప్పిదం లేదా విడాకులే అవ్వాలి తప్ప.. సామాజికంగా అంగీకారమైతే చాలు ఆమోదయోగ్యం అవకూడదు. వివాహాన్ని కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య సాధారణ ఒప్పందంలా చూస్తే, కోర్టు తీర్పులో తప్పు లేదుగానీ ఆ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి అంచనా వేస్తే మాత్రం, రాజ్యాంగ ప్రజాస్వామ్య లక్ష్యాలకు విఘాతం కలిగించేలా ఉంటుంది.

శబరిమలలో మహిళల ప్రవేశం గురించి కూడా కోర్టు అత్యుత్సాహాన్నే ప్రదర్శించిందనుకోవాలి. శబరిమల దర్శనంగానీ, అక్కడ మకరజ్యోతి కనిపించటంగానీ ప్రధానంగా విశ్వాసాలకు సంబంధించిన అంశాలు. ఆ విశ్వాసం ద్వారా తమ జీవితాల్ని మెరుగుపరచుకోవాలని పలువురు భావిస్తున్నారు. అందులో రకరకాల అలవాట్లను వదిలించుకోవటం, ఏకాగ్రతను పెంచుకోవటం ప్రధానమైనవి. ఇంద్రియ నిగ్రహానికి బ్రహ్మచర్యాన్ని కీలకంగా భావించటం భారతదేశంలో గాంధీజీ సహా అనేకమంది ప్రముఖులు కూడా ఆచరించి చూపిన మార్గం. ఇందుకు అయ్యప్ప దీక్ష ఒక చక్కటి మార్గంగా పనిచేస్తోంది. ఇందులో లింగ వివక్షను, మితిమీరిన శాస్త్రీయతను వెతికేకంటే, ఆ అంశాన్ని స్థానికంగానే సంబంధిత వర్గాలన్నీ కలిసి పరిష్కరించుకోండని వదిలేస్తే అభినందనీయంగా ఉండేది. అయ్యప్ప శివకేశవుల పుత్రుడనటానికి కోర్టు ఆధారాలను వెతకగలదా? లక్షలాది మహిళలేమీ శబరిమల వెళ్లలేక పోతున్నందుకు వేదనతో మొర పెట్టుకుంటున్నారా? లేదా అందులో ఏమన్నా మహిళల సమానత్వానికి సంబంధించిన లోతైన అంశాలున్నాయా, వాళ్ల జీవితాల్ని అదేమైనా గణనీయంగా మార్చేసేదా? కోర్టు తీర్పు ఎంత అవాంఛనీయమైనదో చెప్పటానికి.. శబరిమల ప్రయాణం వ్యయప్రయాసలతో కూడుకున్నది, మహిళల భద్రత.. వంటి అంశాలదాకా కూడా పోనక్కర్లేదు.

భారతదేశం వంటి చోట ఇలాంటి తీర్పులు చాలా వ్యతిరేక ఫలితాలకు దారి తీసే అవకాశం ఉంది. వివాహేతర సంబంధాలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన మరునటి రోజు వార్తాపత్రికల్లో పతాకశీర్షికలు చూసిన చాలామంది.. వివాహేతర సంబంధాలు తప్పు కాదు అనే అర్థం చేసుకున్నారు. సామాజికంగా తప్పు.. అనే అంశానికి కూడా వారు ప్రాధాన్యత ఇవ్వలేదు. అయితే దేవుడికి మొక్కులు చెల్లిస్తే ఎన్ని తప్పులైనా చేయొచ్చనే ఆత్మవంచనా ధోరణి మన సంస్కృతిలో పాతుకుపోయింది కాబట్టి.. వివాహేతర సంబంధాల కోసం ఇంకొంత బరితెగించవచ్చుగానీ, కోర్టు తీర్పును మాత్రం భారతీయులు యథాతథంగా ఆమోదించలేరు.

ఇలా ఆమోదయోగ్యం, అమలుకు వీలుకాని చట్టాలని చేస్తూ ప్రజల్లో గందరగోళాన్ని కోర్టులు పెంచుతూ పోతే, ఆ పరిస్థితిని ఉపయోగించుకుని ఛాందస శక్తులు, నియంతృత్వ రాజకీయం బలపడే అవకాశముంది. సమాజంలో ఉన్న తప్పుల్ని సరిచేయటానికి తీర్పులనిచ్చే క్రమంలో ఇచ్చే అసంబద్ధమైన తీర్పుల వల్ల తలెత్తే అసంబద్ధ పరిస్థితుల్ని సరిచేసే నెపంతో.. ఛాందసశక్తులు కొత్తబలాన్ని పుంజుకునే ప్రమాదం ఉంది. చూశారా, దేశంలో నైతిక విలువలే మృగ్యమై పోతున్నాయంటూ వాళ్లు పెట్టే గగ్గోలుకు

కచ్చితంగా ఎక్కువ శాతం ప్రజల నుంచి స్పందన కనిపిస్తుంది. ప్రతిపక్షంలోని ఏ పార్టీకీ ప్రత్యామ్నాయ రాజకీయం లేకపోవటం వల్ల.. రాజ్యాంగం కంటే ఛాందసమైనా సాంప్రదాయాలే మిన్న అనే ఈ మోరల్ పోలీసింగ్ రాజకీయమే దేశం మీద పెత్తనం చేసే అవకాశముంటుంది.

మహిళల హక్కుల కోసం సుప్రీంకోర్టు విలువైన తీర్పులనిచ్చిందనటంలో సందేహం లేదు. షాబానో కేసులో, బాలికల అక్రమరవాణాకు వ్యతిరేకంగా అధికారులను కదిలించటంలో, లింగనిర్ధారణ పరీక్షలు, మైనరు బాలికతో శృంగారం, పరువు హత్యలు, మహిళలకు ఆస్తి హక్కులు వంటి విషయాల్లో సుప్రీంకోర్టు చాలా అభ్యుదయ తీర్పుల్ని ఇచ్చింది. కానీ వివాహేతర సంబంధాలపై తీర్పు (అంతకుముందు వైవాహిక రేప్‌పై ఇచ్చిన తీర్పుపై కూడా)పై మాత్రం బహుముఖమైన, లోతైన విమర్శ అవసరం. మహిళలు పుట్టుక దగ్గర్నుంచి రకరకాల వివక్షలకు గురవుతూ వివాహ వ్యవస్థలోనూ అణచివేతకు గురవుతుండటం వారిలో వివాహేతర సంబంధాల వైపు మొగ్గుకు పెద్ద కారణమైతే, సమాజం ఇస్తున్న నిర్వచనం ప్రకారం తమ పురుషత్వాన్ని నవ్వులపాలు కాకుండా నిలబెట్టుకునే ప్రయత్నంలో గుడ్డిగా తప్పులు చేయటం పురుషుల వైపు నుంచి ఒక పెద్ద కారణం. ఒకరకంగా పురుషుల్లో శరీర ధర్మాల పనితీరుపై అవగాహనాలోపం, సమాజంలోని పెత్తందారీ భావజాలం కలగలిసి మహిళల వట్ల అణచివేతగా కొనసాగుతోంది.

ఇంట్లో మహిళల్ని పోషించటానికి పలువురు పురుషులు మోసే ఒత్తిడిని, భారాన్ని తీసిపారేయలేం. ఇందుకుగాను తాను మహిళ మీద సర్వాధికారాలూ చెలాయించటానికి హక్కును కలిగి వుంటానని అలాంటివారు భావిస్తుంటారు. పురుషుల మీద ఆధారపడిన మహిళలు కూడా పరిస్థితుల్ని, చుట్టూ ఉన్న సమాజ భావాల్ని అంత తేలిగ్గా తోసిపుచ్చలేరు. వీరు కూడా యథాతథ పరిస్థితిని కొనసాగించటంలో ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. వివాహ వ్యవస్థతో సంబంధం లేకుండా పిల్లలు కూడా స్వేచ్ఛగా ఎదిగే ప్రపంచం ఎప్పుడో రావొచ్చేమో కానీ, అలాంటిది ఇప్పటికైతే ఆచరణసాధ్యం కాని ఆలోచనే. చట్టబద్ధపాలనకు తోడు కుటుంబ వ్యవస్థ విలువలు బలంగా ఉండటం, స్త్రీ–పురుష తేడా లేకుండా అందరికీ మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల్ని అందుబాటులోకి తేవటంతో మాత్రమే భద్రత, శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా ఎదిగే అవకాశాలు ప్రతి తరానికీ లభిస్తాయన్నదే ఇప్పుడు సుసాధ్యమైన మంచి! కుటుంబ వ్యవస్థ బలహీనపడటం, సామాజిక అవసరాలు–పరిణామాలతో ఘర్షణలో కుటుంబ వ్యవస్థలోని బలహీనతలు పేట్రేగుతూ విలువలు దిగజారటం, విద్యారంగం అధ్వాన్నంగా ఉండటం వల్ల ఇటీవల మనదేశంలో కూడా మానసిక రోగుల సంఖ్య వేగంగా పెరుగుతోందని గుర్తించాలి. భారత్‌లో దాదాపు 10 కోట్లమంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్టు అంచనా. ఈ సంఖ్య ఇంకా ఎక్కువేనని ఇంకొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. రానున్న కాలంలో మానసిక సమస్యల జనాభా భారత్‌కు మరో పెద్ద సవాలు కానుంది.

కోర్టు తన తీర్పుల్ని మార్చుకునే అవకాశముంది. వివాహేతర సంబంధాలపై తీర్పుని కోర్టు ఎప్పటికైనా మరోసారి మార్చుకోవచ్చేమో. కానీ కోర్టు ఇచ్చిన తీర్పుపై రాజకీయ వ్యవస్థ ద్వారా కేంద్రంలో, రాష్ట్రాల్లో చట్టసభల్లో చర్చ జరిగి ఒక హేతుబద్ధమైన, ఆచరణాత్మకమైన చట్టాన్ని తెచ్చుకోవటమే మెరుగైన మార్గం. ఈ దిశగా పాలకుల నుంచి ఆశించటం ఇప్పటికిప్పుడు అత్యాశలాగే కనిపిస్తున్నా, ఇదే సరైన పరిష్కారం. మన ఓటుని, చర్చల ద్వారా అభిప్రాయాల్ని మలచే స్వేచ్ఛని అటువంటి ప్రజాప్రతినిధుల ఎన్నిక, రాజకీయం కోసం వినియోగిద్దాం. ప్రముఖ సంపాదకుడు శేఖర్‌గుప్తా అన్నట్టు, "పార్లమెంటులో చర్చలు, మెజారిటీ ద్వారానే హిందూ పర్సనల్ లా చట్టాలు, సంప్రదాయాల్లో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో మార్పులు తీసుకొచ్చారు. ఇలాంటి సంస్కరణలను అత్యుత్తమ సుప్రీంకోర్టు బెంచ్‌లు కూడా గత కొన్ని దశాబ్దాల్లో చేయలేకపోయాయి" (అయితే ఈ విషయంలో నెహ్రూ కంటే అంబేద్కర్ ప్రయత్నం ఎక్కువనే విషయాన్ని కూడా మనం మననం చేసుకోవాలి). న్యాయస్థానాల మీద మితిమీరి ఆధారపడకుండా మనం ఎన్నుకునే ప్రజాప్రతినిధులు చట్టసభల్లో చర్చించి సమాజానికి పనికివచ్చే చట్టాల్ని చేసేలా రాజకీయాన్ని, ఎన్నికల వ్యవస్థని సంస్కరించుకోవటం అవసరం. సమర్థులను, ఆలోచనావరుల్ని, సేవాభావం ఉన్నవారిని ఎన్నుకుని చట్టసభలకు, ప్రభుత్వ పదవులకు పంపాలి.

కొనమెరుపు: వివాహేతర సంబంధాలు నేరం కానట్టే పార్టీల ఫిరాయింపులు కూడా నేరం కాదు.. అంటూ ఓ పత్రికలో వచ్చిన కార్టూన్ భావం ఎప్పటికైనా ఆ తీర్పునిచ్చిన న్యాయమూర్తులకు తడుతుందా? ❑

# వేలం పాటల పట్ల హర్షం



రాయదుర్గం మునిసిపాలిటీలో వ్యాపార దుకాణాలకు వేలం పాటలు నిర్వహించటం పట్ల లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరమణబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినవారికి కేటాయించటం, రెన్యూవన్ చేయటం కాకుండా.. పారదర్శకంగా ఈ షాపులకు వేలం నిర్వహించాలని లోక్‌సత్తా తొలి నుంచీ కోరుతోందని, పలుసార్లు విజ్ఞాపనల్ని అందజేసిందని గుర్తుచేశారు. దీనివల్ల అర్హులైన నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరటమే కాకుండా, పురపాలక సంఘానికి ఆదాయం పెరిగిందన్నారు. ఈ వేలం పాటల ద్వారా పురపాలక సంఘానికి రూ.22 లక్షల మేర ఆదాయం సమకూరింది.

# చెరువులకు హంద్రీనీవా నీటిని విడుదల చేయాలి

గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ హంద్రీనీవా నీటిని విడుదల చేయాలని లోక్‌సత్తా ఇంఛార్జి సన్నపడమల రామ్మోహన్ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని కోరారు. ఈ మేరకు వివరాలతో వినతి పత్రాన్ని అందించారు. గుంతకల్లు నియోజకవర్గంలోని చెరువులకు వజ్రకరూరు మండలం రాగులపాడు పంప్‌హౌస్ నుండి చెరువులకు నీళ్ల మళ్లించాలన్నారు. పట్టణంలో విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలి, గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, గుంతకల్లులో మూత పడిన స్పిన్నింగ్ మిల్లు ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, గుత్తి, పామిడి మండలాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి.. అని కూడా రామ్మోహన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# పత్తికొండ సమస్యలను పరిష్కరించండి



పత్తికొండ పట్టణంలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆనందాచారి డిమాండ్ చేశారు. స్థానిక పాలనా కార్యాలయంలో ఈవో కృష్ణకుమార్‌ని కలిసి వివరాల్ని అందజేశారు. పట్టణంలో 20 వార్డులున్నాయని, ప్రతి వార్డులోనూ వీధి లైట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ సమస్యలు ఉన్నాయన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే నాలుగు స్తంభాల వద్ద మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. రెండు నెలలుగా పట్టణంలో చెత్తాచెదారం పేరుకు పోయిందని, పారిశుద్ధ్యాన్ని అత్యవసరాంశంగా పరిగణించి చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో ఎక్కడబడితే అక్కడ ప్రచార బ్యానర్లను కడుతున్నారని, పదిరోజుల తర్వాత బ్యానర్లను తొలగించాలని కోరారు. లోక్‌సత్తా నాయకులు జయరాముడు, ప్రసాద్, షరీఫ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.




కేంద్రాలు సరిగా లేకపోవటం వల్లే రోజూ వేలమంది గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు వస్తున్నారన్నారు. అక్కడ సదుపాయాలు చాలక అవస్థలు పడుతున్నారన్నారు. మనం బ్రిటన్ విధానాన్ని కాకుండా అమెరికా పద్ధతిలో ఇన్సూరెన్స్ మీద ఎక్కువ ఆధారపడి ఆయుష్మాన్ భారత్‌ను రూపొందించి తీవ్ర తప్పిదం చేస్తున్నామన్నారు. బ్రిటన్ కంటే రెట్టింపును అమెరికా ఖర్చు చేస్తున్నా కూడా సరైన పద్ధతి లేకపోవటం వల్ల అక్కడ ఆరోగ్యం అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. విధానపరమైన వైఫల్యం వల్ల అమెరికా లాంటి సంపన్న దేశంలో అనేకమంది ప్రజానీకం ఆరోగ్యం కోసం ఆందోళన చెందుతున్నారన్నారు. జబ్బు ముదిరాక వైద్యసేవలు, మందులు అందించటం కన్నా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని

# ఆయుష్మాన్ భారత్‌ని సమూలంగా ప్రక్షాళన చేయాలి, ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను తేవాలి: జేపీ

ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి స్కీములతో ప్రజారోగ్యం బాగుపడదని, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో బ్రిటన్ తరహా (నేషనల్ హెల్త్ సర్వీస్) అందరికీ ఆరోగ్యం విధానాన్ని తీసుకురావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ఈ దిశగా మన ఆరోగ్య విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలన్నారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో జరిగిన తెలంగాణ వైద్యగర్జన సభలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రపంచంలోనే బ్రిటన్ తరహా వైద్య వ్యవస్థ మెరుగైనదిగా నిలిచిందని జేపీ అన్నారు. అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ఆస్పత్రుల్లో సైతం జనరల్ ఫిజీషియన్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దీంతో ప్రాథమిక స్థాయి నుంచి ప్రజలకు నాణ్యమైన వైద్యం పారదర్శకంగా అందుతోందన్నారు. జబ్బు ముదరకుండా, మరణాల బారిన పడకుండా బైటపడగలుగుతున్నారన్నారు. మన వద్ద ఇందుకు పూర్తి విరుద్ధంగా జబ్బు ముదిరాక ఉచిత వైద్యం పేరుతో ఉన్న నిధుల్ని ఖర్చు చేస్తున్నారన్నారు.

మన దేశంలో ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ ఆరోగ్య సేవలు అధ్వాన్నంగా ఉండటం వల్లే ఆరోగ్య సంక్షోభం నానాటికీ పెరుగుతోందని జేపీ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య బలోపేతం చేసి, గ్రామీణ ఆస్పత్రుల్లో సైతం జనరల్ ఫిజీషియన్ సేవలు అందుబాటులోకి వచ్చేలా మార్పుల్ని చేయాలన్నారు.

దేశంలో ప్రస్తుతం పది లక్షల మంది ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు ఉన్నారని, వారిలో రెండు లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారని జేపీ తెలిపారు. వీరికి కొద్దిపాటి శిక్షణనిచ్చి జనరల్ ఫిజీషియన్లుగా ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి తమకు నచ్చిన ఫ్యామిలీ డాక్టర్‌ను ఎంచుకునే అవకాశం ప్రజలకు కల్పిస్తే, వైద్యులు కూడా పోటీతత్వంతో సేవలందిస్తూ పెద్దఎత్తున ఆదాయం సంపాదించుకోగలుగుతారని అన్నారు. ఆరోగ్య రికార్డులు సక్రమంగా ఉంటూ ప్రజలకు జేబులో నుంచి ఏమాత్రం ఖర్చు లేకుండా మంచి ప్రమాణాల వైద్యం అందుతుందన్నారు. దీంతోపాటు కోట్ల ఉద్యోగాలు ఈ రంగంలో అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ రంగంలోనైనా, ప్రైవేటు భాగస్వామ్యంతో నైనా విద్య, వైద్యం బాధ్యత పూర్తిగా ప్రభుత్వాలదేనని, జీడీపీలో వైద్య ఆరోగ్యానికి 5 శాతం దాకా కేటాయించాలని, అందుకు తగ్గ ఫలితాలు కూడా కన్పిస్తాయని జేపీ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నేషనల్ మెడికల్ హెల్త్ స్కీమ్ (ఆయుష్మాన్ భారత్)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంజీవ్‌సింగ్, డాక్టర్ అశోక్‌రెడ్డి, డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ❐

## జన జీవితం, యువత భవిష్యత్తుతో సంబంధంలేని ఎన్నికలు, రాజకీయంపై..

# 6,7 జనవరి 2019 న విజయవాడలో లోక్‌సత్తా పార్టీ ఏపీ, తెలంగాణ నేతల విస్తృత మేధోమథనం: జేపీ



ప్రజల జీవితాలతో సంబంధంలేకుండా ఎన్నికలు, రాజకీయ ప్రక్రియ జరుగుతున్న సందర్భంలో.. జన జీవితాలకి, యువత భవిష్యత్తుకి రాజకీయాన్ని కేంద్రబిందువు చేయటం కోసం లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ నిర్మాణాత్మక పాత్ర పోషించటం అవసరమని వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నేతలతో జనవరి 6,7 తేదీలలో విజయవాడలో విస్తృత స్థాయి మేధోమథన సదస్సును నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

రాజకీయాల గతిని మార్చి ప్రజల చుట్టూ తిరిగేలా చేయటంలో.. రాష్ట్రాలవారీగా 6 సురాజ్య లక్ష్యాల సాధన, రాష్ట్ర స్థాయి పాలనపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం, అనవసర శృంఖలాలు లేకుండా ఫెడరలిజాన్ని పునర్నిర్వచించటం కీలకమైనవిగా గుర్తించినట్టు జేపీ తెలిపారు.

"దేశంలో ఎన్నికలు ఏ స్థాయిలో జరుగుతున్నా ప్రజల ఓటు ఒక రాష్ట్రంలోని ప్రభుత్వానికి లేక నాయకులకి అనుకూలంగాగానీ, వ్యతిరేకంగా గానీ వేస్తున్నారు. రాష్ట్రాలే రాజకీయానికి, పరిపాలనకు కేంద్రబిందువులయ్యాయి. అందువల్లనే వివిధ స్థాయిల్లో - గ్రామీణ స్థానిక ప్రభుత్వాలు, పట్టణ-నగర ప్రభుత్వాలు, రాష్ట్ర శాసనసభ, లోక్‌సభ - అన్ని ఎన్నికల్లో ప్రజలిచ్చే ఓటు రాష్ట్రంలో ప్రభుత్వాలు, పార్టీలు, నాయకుల పనితీరు మీద తీర్పుగా ఉంది తప్ప.. జాతీయస్థాయిలోని ప్రభుత్వం లేదా పార్టీల పనితీరు మీద కాదు! కానీ అదే సమయంలో రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ప్రజలిచ్చిన తీర్పునకనుగుణంగా తమ బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించటంలో అవరోధాలున్నాయి.

"ఇప్పటికి కూడా కేంద్రీకరించిన పాలనలో బాధ్యత రాష్ట్రాలకుండగా.. యూనియన్ ప్రభుత్వం పెత్తనం చేస్తోంది. దీనివల్ల రాజ్యాంగపరంగా ప్రజలకి మంచి పాలనని, సేవలని అందించే వెసులుబాటు రాష్ట్రాలకు లేకుండా పోతోంది. ఈ పరిస్థితుల్లో లోక్‌సత్తా ఓ వంక సురాజ్య లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాలవారీగా ప్రజలని చైతన్యం చేసేందుకు ఉద్యమాలు నిర్మించటం, మరోవైపు ఫెడరల్ వ్యవస్థను పునర్నిర్మించటం అవసరం.

"దేశ ఐక్యతను బలోపేతం చేస్తూ ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ కర్తవ్యాల్ని సక్రమంగా నిర్వర్తించేందుకు కేంద్రీకృత శృంఖలాలు తొలిగేలా, వెసులుబాటు ఉండేలా ఫెడరల్ వ్యవస్థను పునర్నిర్మించటం కోసం లోక్‌సత్తా పార్టీ నిర్మాణాత్మక పాత్ర పోషించటం అవసరం. ఈ నేపథ్యంలోనే 6 సురాజ్య లక్ష్యాల సాధన, ఫెడరలిజం బలోపేతం కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోక్‌సత్తా పార్టీ నాయకులతో జనవరి 6,7 తేదీలలో విజయవాడలో విస్తృతస్థాయి మేధోమథనాన్ని చేపట్టాం" అని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ❐

### వర్మ, కటారి, రమేష్ రెడ్డి, శివరాంలపై బహిష్కరణను ఉపసంహరించుకున్న లోక్‌సత్తా పార్టీ

డి.వి.వి.ఎస్ వర్మ, కటారి శ్రీనివాసరావు, అల్లు రమేష్‌రెడ్డి, కె.శివరాంలను గతంలో లోక్‌సత్తా పార్టీ నుంచి బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు, తిరిగి పూర్తిస్థాయిలో వారి సేవల్ని పార్టీ క్రియాశీలంగా వినియోగించుకోనున్నట్లు జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# స్థానిక పాలన బాగుపడితేనే... రాష్ట్రం, దేశం బాగుపడతాయి !



ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మౌలిక లోపాలపై ప్రజ్ఞాపూర్ మాజీ సర్పంచ్, లోక్‌సత్తా సీనియర్ నేత బండారు రామ్మోహనరావు హైదరాబాద్‌లో ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) పరిశోధకులకు వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఐదు దశాబ్దాల ముందు వరకూ స్థానిక ప్రభుత్వాలు తగిన అధికారాలు, నిధులతో ఎలా వెలుగొందాయో, వాటి నుంచి ప్రజాస్వామ్యం, నాయకత్వం ఎలా వికసించాయో సోదాహరణంగా చెప్పారు. అమెరికన్ రాజ్యాంగం కంటే కూడా ఎక్కువ పదాలతో తయారుచేసిన 73, 74 రాజ్యాంగ సవరణలు స్థానిక సాధికారత కల్పించడంలో విఫలం కావటంతో ఇప్పటికీ ఎన్నికలు, నిధులు, అధికారాలు స్థానిక ప్రభుత్వాల విషయంలో మొక్కుబడిగా మారాయన్నారు. మూడో అంచె ఫెడరలిజంలో భాగంగా స్థానిక ప్రభుత్వాల సాధికారతకు సమయం ఆసన్నమైందన్నారు. లోక్‌సత్తా ప్రతిపాదించిన బడ్జెట్‌లో 'తలసరి' కేటాయింపు వంటి మార్గాల్లో ఫెడరలిజం విస్తరణకు ఆచరణాత్మక అవకాశాలున్నాయని, ఈవేళ దేశంలో నడుస్తున్న రాజకీయం నేపథ్యంలో కూడా మార్పుకి ఎక్కువ అవకాశాలు ఎక్కడికక్కడ స్థానికంగానే ఉన్నాయన్నారు.






# ఫూలే లక్ష్యాన్ని సాధించే ఎజెండా మాది

మహాత్మాజోతిబా ఫూలేకు వర్ధంతి సందర్భంగా లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణబాబు రాయదుర్గంలో నివాళులర్పించారు. విద్య కోసం ఫూలే దంపతులు కన్న కలల్ని సాకారం చేసేలా నాణ్యమైన విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేసిన తొలి రాజకీయ పార్టీ లోక్‌సత్తా అని వారన్నారు.

Posting Date 22-12-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on December16th 2018

# HAPPY NEW YEAR 2019



"మార్పు ఎప్పటికైనా వస్తుంది. కానీ ఎన్ని కోట్ల మంది నష్టపోకుండా మార్పును సాధించాం, సాధించే ప్రయత్నం చేశామన్నదే నాయకత్వ పటిమకు గీటురాయి! అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, లాభసాటి వ్యవసాయాలకు 2019లోనైనా తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో గట్టి పునాదులు పడతాయని, ఎన్నికల్లోనూ - ఎన్నికల మధ్య కూడా వాటి కోసం గట్టి ప్రజాస్వామిక ప్రయత్నాలు జరుగుతాయని ఆశిస్తూ.... నూతన సంవత్సర శుభాకాంక్షలు."

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad